ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

5

విశాఖపట్నం

జిల్లా వార్తలు

మంగళవారం 10 జూన్ 2025





ఏఐఐబీ ప్రతినిధులకు గురుద్వారా జంక్షన్‌లో పరిస్థితిని వివరిస్తున్న ఏఎంఆర్‌సీ ఎండీ రామకృష్ణారెడ్డి

లోకేశ్‌కు ఘన స్వాగతం

రాత్రికి టీడీపీ కార్యాలయంలోనే బస

విశాఖపట్నం/గోపాలపట్నం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్ రెండు రోజుల ఉత్తరాంధ్ర పర్యటన నిమిత్తం సోమవారం విశాఖకు చేరుకున్నారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో ఉదయం 8.30 గంటలకు విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పి.గణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, పలువురు టీడీపీ నేతలు ఘనం గా స్వాగతం పలికారు. అనంతరం లోకేశ్ రోడ్డు మార్గంగో గుండా పార్వతీపురం మన్యం జిల్లాకు బయలుదేరి వెళ్లారు.

కాగా పార్వతీపురంలో షైనింగ్ అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొన్న అనంతరం ఆయన రాత్రి 10 గంటల ప్రాంతంలో నగరంలోని టీడీపీ కార్యాలయానికి చేరుకున్నారు. లోకేశ్‌కు ఇన్‌చార్జి మంత్రి

... మిగతా 6వ పేజీలో



పార్టీ కార్యాలయంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీబాల వీరాంజనేయ స్వామి, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, తదితరులతో మాట్లాడుతున్న నారా లోకేశ్

12 మంది తహశీల్దార్ల బదిలీ

గాజువాక, సీతమ్మధార, ఆనందపురం రెవెన్యూ అధికారులకు స్థానచలనం

- పెందుర్తి తహశీల్దార్‌గా రామకృష్ణ
- పెందుర్తి, ములగాడ తహశీల్దార్లు అనకాపల్లి జిల్లాకు కేటాయింపు
- అల్లూరి జిల్లా నుంచి ఇద్దరు విశాఖ జిల్లాకు రాక
- అచ్యుతాపురం నుంచి అల్లూరి జిల్లాకు జనార్దన్
- జడ్పీలో 75మందికి బదిలీ
- జలవనరుల శాఖలో 100 మంది...

విశాఖపట్నం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లాలో కీలకమైన ఆనందపురం, పెందుర్తి, గాజువాక తహశీల్దార్లపై బదిలీ వేటు పడింది. కీలకమైన పెందుర్తి తహశీల్దారుగా అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి వచ్చిన రామకృష్ణను నియమించారు. ఆనందపురం, గాజువాక తహశీల్దార్లుగా ఎవరినీ నియమించకుండా.. అక్కడ పనిచేస్తున్న డీటీలు చేతన్‌కుమార్, శ్రీనివాసరావులకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అచ్యుతాపురం తహశీల్దారు జి.జనార్దన్ అల్లూరి జిల్లాకు బదిలీ అయ్యారు. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా 12 మంది తహశీల్దార్ కేడర్ ఉద్యోగులను బదిలీ చేశారు. ఈ మేరకు విశాఖ కలెక్టర్

... మిగతా 6వ పేజీలో



జడ్పీలో బదిలీలకు సంబంధించి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

బదిలీ అయిన తహశీల్దార్లు.. వివరాలు

అధికారి	పనిచేస్తున్న ప్రదేశం	బదిలీ అయిన స్థానం
1. ఎం.ఆనందకుమార్	పెందుర్తి	అనకాపల్లి జిల్లా
2. ఎం.భుజంగరావు	ములగాడ	అనకాపల్లి జిల్లా
3. బి.నాగరాజు	అల్లూరి కలెక్టరేట్	అనకాపల్లి జిల్లా
4. సీహెచ్.తిరుమలరాజు	అల్లూరి కలెక్టరేట్	అనకాపల్లి జిల్లా
5. ఎం.భాస్కర అప్పారావు	అల్లూరి కలెక్టరేట్	అనకాపల్లి జిల్లా
6. టి.రామకృష్ణ	అల్లూరి జిల్లా	పెందుర్తి మండలం
7. ఎంవీవీ. ప్రసాద్	అల్లూరి జిల్లా	భూపరిరక్షణ విభాగం, విశాఖ కలెక్టరేట్
8. బీవీ.రాణి	అనకాపల్లి కలెక్టరేట్	విశాఖ కలెక్టరేట్
9. జి.జనార్దన్	అచ్యుతాపురం	అల్లూరి జిల్లా
10 పి.శ్యాంప్రసాద్	ఆనందపురం	విశాఖ కలెక్టరేట్
11. టి.శ్రీవల్లి	గాజువాక	వీఎంఆర్‌డీఏ స్పెషల్ తహసీల్దారు
12. ఎం.రమేశ్	సీతమ్మధార	ములగాడ

సింహాచల దేవస్థానం ఈవో త్రినాథ్‌కు ఆర్‌జేసీగా బదిలీ

- తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు అదనపు బాధ్యతలు
- చందనోత్సవం ఎఫెక్టేనా?

విశాఖపట్నం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సింహాచల దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న వి.త్రినాథరావును రాజమహేంద్రవరం రీజనల్ జాయింట్ కమిషనర్, మల్టీ జోన్-1గా బదిలీ చేస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి ఆదేశాలు వచ్చేంత వరకు సింహాచలం ఈవోగా అదనపు బాధ్యతలు నిర్వర్తించాలని సూచించింది. కాగా గత ఈ ఏడాది ఏప్రిల్ 30న చందనోత్సవం సందర్భంగా గోడ కూలిన

... మిగతా 8వ పేజీలో



మెట్రో రైలు కారిడార్‌లో మరో ముందడుగు

- రూ.6 వేల కోట్ల రుణ సాయం చేసేందుకు ఏఐఐబీ ఆసక్తి
- ఏఎంఆర్‌సీ ఎండీతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన

విశాఖపట్నం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం మెట్రో రైలు ప్రాజెక్టులో మరో అడుగు ముందుకుపడింది. ఈ ప్రాజెక్టుకు సాయం చేయడానికి ముందుకు వచ్చిన ఏసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) ప్రతినిధులు క్షేత్ర పర్యటనకు వచ్చారు. అమరావతి మెట్రో రైలు కార్పొరేషన్ (ఏఎంఆర్‌సీ) మేనేజింగ్ డైరెక్టర్ రామకృష్ణారెడ్డి వారిని సోమవారం విశాఖకు తీసుకువచ్చి.. కొమ్మాది నుంచి స్టీల్‌ప్లాంటు వరకు స్టేషన్లు నిర్మించే స్థలాలను చూపించారు. ఎక్కడెక్కడ ఏమేమి నిర్మించాలనుకుంటున్నదీ వారికి వివరించారు. ఈ సందర్భంగా ఆయన గురుద్వారా కూడలిలో విలేకరులతో కొద్దిసేపు మాట్లాడారు.

తొలి దశలో కొమ్మాది నుంచి స్టీల్‌ప్లాంటు వరకు 34.4 కి.మీ., గురుద్వారా నుంచి పాత పోస్టాఫీసు వరకు 5.07 కి.మీ., తాటిచెట్లపాలెం నుంచి చినవాల్తేరు వరకు 6.75 కి.మీ. పొడవునా మూటు కారిడార్లను నిర్మిస్తామన్నారు. కొమ్మాది-స్టీల్‌ప్లాంట్ మధ్య 29 స్టేషన్లు, గురుద్వారా-పాత పోస్టాఫీసుల మధ్య ఆరు స్టేషన్లు, తాటిచెట్లపాలెం-చినవాల్తేరుల మధ్య ఏడు స్టేషన్లు కలిపి మొత్తం 42 స్టేషన్లను నిర్మిస్తామని పేర్కొన్నారు. విజయవాడ, విశాఖపట్నం మెట్రో రైలు ప్రాజెక్టులకు తొలి దశలో రూ.12 వేల కోట్లు అవసరం కాగా ఏఐఐబీ రూ.6 వేల కోట్లను రుణంగా ఇవ్వడానికి ముందుకు వచ్చిందన్నారు. ప్రాజెక్టు చేపట్టే ప్రాంతాలు, ట్రాఫిక్, తదితర అంశాలను తెలుసుకునేందుకు విశాఖపట్నం వస్తే వారికి అన్నీ వివరించామన్నారు.

నగరం గరం..



- ఎండ తీవ్రత, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు
- ఎయిర్‌పోర్టులో 39.2 డిగ్రీలు..

విశాఖపట్నం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఎండ తీవ్రత, ఉక్కపోతతో నగరం ఉడికిపోయింది. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మాడుపగిలేలా ఎండ కాసింది. 'ఉక్క'రిబిక్కిరి చేసేలా ఉక్కపోత కొనసాగింది. ఉదయం పూట బలహీనమైన మేఘాలు ఉన్నప్పటికీ ఎండ ప్రభావం నెలకొనడంతో నగరం వేడెక్కింది. మధ్యాహ్నం సమయానికి నగరం

... మిగతా 8వ పేజీలో



సాక్షి కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న తెలుగు మహిళలు

సాక్షి కార్యాలయం వద్ద తెలుగు మహిళల ధర్నా

- అమరావతి అభివృద్ధిని చూడలేక దుష్ప్రచారం చేస్తున్న వైసీపీ
- తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి

- వార్త 7వ పేజీలో

విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలి

- షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానోత్సవంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీబాలవీరాంజనేయస్వామి
- బట్టీ చదువులకు స్వస్తి పలకాలి: ఎంపీ శ్రీభరత్
- 121 మందికి రూ.24,20,200 అందజేత: కలెక్టర్ హరేంధిర ప్రసాద్

సిరిపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులందరూ కష్టపడి చదివి సమాజంలో ఉన్నత స్థానాలను అధిరోహించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఆకాంక్షించారు. సోమవారం ఏయూ అసెంబ్లీ హాల్‌లో పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థుల కోసం నిర్వహించిన షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా

... మిగతా 8వ పేజీలో



ఇంటర్ విద్యార్థిని కాండ్రేగుల జ్వలితకు మెరిట్ సర్టిఫికెట్ అందజేస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి. చిత్రంలో ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే గణబాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, జేసీ మయూర్ అశోక్


ఏయూ ప్రొఫెసర్లపై సస్పెన్షన్లు ఎత్తివేత

- బీటెక్‌లో క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సు ప్రారంభం
- సీఏఎస్ ప్రమోషన్లకు గ్రీన్ సిగ్నల్
- పాలక మండలి సమావేశంలో కీలక నిర్ణయాలు

విశాఖపట్నం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం పాలక మండలి సమావేశంలో కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సోమవారం సాయంత్రం సుమారు రెండు గంటలపాటు జరిగింది. సమావేశానికి మొత్తంగా 15 మంది సభ్యులకు గాను ఇద్దరు మినహా మిగిలిన వారంతా ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానంలో హాజరయ్యారు. సమావేశంలో కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (సీఏఎస్) ప్రమోషన్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇప్పటికే ఇంటర్వ్యూలు కూడా నిర్వహించినందున తదుపరి

... మిగతా 8వ పేజీలో

యోగాంధ్ర వేడుకలకు విస్తృత ఏర్పాట్లు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణబాబు, పక్కన కలెక్టర్ హరేంధిర ప్రసాద్

- ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు పటిష్ఠ చర్యలు చేపట్టాలి
- ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు
- 8 జిల్లాలకు చెందిన 156 మంది అధికారులకు బాధ్యతలు
- యోగాంధ్రపై నేడు మంత్రుల కమిటీ సమావేశం

విశాఖపట్నం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21 అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని చేపట్టనున్న యోగాంధ్ర కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని అధికారులకు రాష్ట్ర ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆరోగ్యశాఖ, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ జి.వీర పాండియన్, కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌తో కలిసి అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ ఎత్తున చేపట్టే ఈ యోగా కార్యక్రమం గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డుల్లో స్థానం దక్కించుకునే అవకాశం ఉందని, అందువల్ల ప్రతిఒక్కరూ సమన్వయంతో బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఆర్కే బీచ్‌లో ప్రధాన వేదిక నుంచి భీమిలి వరకు బీచ్ రోడ్డు పొడవునా విద్యుత్ దీపాలు, సీసీ కెమెరాలు, ఇంటర్నెట్, ఎల్‌ఈడీ స్ర్కీన్లు, డ్రోన్లను ఏర్పాటు చేయడంతో పాటు

... మిగతా 8వ పేజీలో

విశాఖ పోర్టులో డ్రైవర్ హత్య

- బొగ్గు లోడు అపహరించారనే అభియోగంతో నిర్బంధం
- ఇనుప రాడ్డుతో తలపై మోదిన రౌడీషీటర్
- కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి
- సూపర్‌వైజర్‌నూ కొట్టడంతో తీవ్ర గాయాలతో కేజీహెచ్‌లో చికిత్స

విశాఖపట్నం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విశాఖ పోర్టులో బొగ్గు హ్యాండ్లింగ్ చేసే ఓ కంపెనీలో లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్న వ్యక్తి సోమవారం హత్యకు గురయ్యాడు. యార్డుకు వెళ్లాల్సిన సరకును బయటకు తీసుకువెళ్లిపోయాడయే అనుమానంతో ఆయనతో పాటు యార్డు సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న వ్యక్తిని కంపెనీ కార్యాలయంలో నిర్బంధించి రౌడీషీటర్‌తో చితకబాదించారు. దెబ్బలకు తాళలేక డ్రైవర్ మృతి చెందగా, సూపర్‌వైజర్ గాయాలతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. త్రీస్టార్ పేరుతో ఒక కంపెనీ పోర్టులో బొగ్గు హ్యాండ్లింగ్ చేస్తోంది. పోర్టు నుంచి యార్డుకు లారీలతో సరకును తరలిస్తుంటుంది. పోర్టు నుంచి యార్డుకు చేరాల్సిన సరకులో రెండు లోడ్‌లు బయటకు వెళ్లిపోయినట్టు కంపెనీ

... మిగతా 6వ పేజీలో

కాంట్రాక్టు కార్మికుల తొలగింపు చట్ట విరుద్ధం

కూర్మన్నపాలెంలో దీక్షా శిబిరాన్ని పోలీసులు స్వాధీనం చేసుకోవడం దారుణం

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఆదినారాయణ, అయోధ్యరామ్

కూర్మన్నపాలెం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను తొలగించడం చట్ట విరుద్ధమని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్‌లు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ, ప్లాంటుకు సొంత గనులు కేటాయించాలంటూ కూర్మన్నపాలెంలో 1,579 రోజులుగా నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని సోమవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయినప్పటికీ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు శిబిరం బయట మండుటెండలో నేలపై కూర్చునే ఆందోళనను కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతియుతంగా నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలను పోలీసులతో అణచివేయాలని చూడడం దారుణమన్నారు. నలభై ఏళ్లుగా తాము ఎన్నో పోరాటాలు చేశామని, ఏనాడూ దీక్షల

... మిగతా 6వ పేజీలో



దీక్షా శిబిరం వద్ద మాట్లాడుతున్న ఆదినారాయణ, నేలపై కూర్చున్న కార్మికులు

జీవీఎంసీ ఇన్‌చార్జి సీఈగా పల్లంరాజు



జీవీ పల్లంరాజు

- ఏసీబీ కేసు పెండింగ్‌లో ఉన్న అధికారికి బాధ్యతలు అప్పగించడంపై విమర్శలు
- చక్రం తిప్పిన నగరానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి

విశాఖపట్నం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ ఇన్‌చార్జి చీఫ్ ఇంజనీర్‌గా జీవీ పల్లంరాజుకు పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ రాష్ట్ర పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేశ్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జీవీఎంసీ చీఫ్ ఇంజనీర్‌గా పనిచేసిన పి.శివప్రసాదరాజు గత నెల 31న పదవీ విరమణ చేయడంతో ఆ పోస్టు ఖాళీగా ఉన్న సంగతి తెలిసిందే. చీఫ్ ఇంజనీర్‌గా జీవీఎంసీకి వచ్చేందుకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న కె.వేణుగోపాల్, వీఎంఆర్డీఏ చీఫ్ ఇంజనీర్ వినయ్ కుమార్ ప్రయత్నించారు. వినయ్‌కుమార్ ప్రస్తుతం వ్యక్తిగత సెలవుపై అమెరికా వెళ్లగా, గతంలో జీవీఎంసీలో ఎస్ఈగా పనిచేసిన కె.వేణుగోపాల్‌కు అవకాశం దక్కుతుందని అందరూ భావించారు. కానీ జీవీఎంసీలో ప్రస్తుతం ఎస్ఈగా పనిచేస్తున్న పల్లంరాజుకు ఇన్‌చార్జి సీఈగా పూర్తి అదనపు బాధ్యతను అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. పల్లంరాజుపై ఏసీబీ కేసు పెండింగ్‌లో ఉండడంతోపాటు ఆయన ఎస్ఈ క్యాడర్‌లో ఉన్నందున ఆయనకు

... మిగతా 6వ పేజీలో

ఉత్సాహంగా యోగాంధ్ర ర్యాలీలు

భీమునిపట్నం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : భీమిలిలో యోగాంధ్రపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. జడ్సీ అయ్యప్పనాయుడు ఆధ్వర్యంలో జోన్ వన్ కార్యాలయం నుంచి పాతబస్టాండ్, మెయిన్ రోడ్ మీదుగా గంట స్తంభం వరకూ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా జడ్సీ మాట్లాడుతూ ఈనెల 21న జరిగే యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగానే ఈ ర్యాలీ జరిపామన్నారు. ఈ కార్యక్రమంలో మూడో వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, నాయకులు కొక్కిరి అప్పన్న, జోనల్ కార్యాలయం, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మధురవాడ : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు అన్నారు. ఈనెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఏడో వార్డులోని వాంబే కాలనీ, పిలకవానిపాలెం ప్రాంతాల్లో కూటమి నాయకులు, అధికారులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యోగా చేయడం వల్ల రోగాలు దరి చేరవన్నారు.

ఎండాడ, సాగర్‌నగర్ : మానసిక ఒత్తిడి నుంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే వ్యాయామంతో పాటు యోగా, ధ్యానం తప్పనిసరి అని జోన్-2 కమిషనరు కనకమహాలక్ష్మి అన్నారు. యోగాంధ్రలో భాగంగా ఎండాడ ఎస్సీ కాలనీలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు చినగోపి, శాఖరి శ్రీనివాస్, ఒమ్మి బాబూరావు, దొరబాబు, మంగాదేవి, అంబేడ్కర్ యువజన సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు. అలాగే 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, జడ్సీ కనక మహాలక్ష్మి ఆధ్వర్యంలో సాగర్‌నగర్‌లో ర్యాలీ చేశారు.

విశాలాక్షినగర్ : యోగాంధ్రలో భాగంగా 9వ వార్డులోని రామాలయం వీధి, తదితర ప్రాంతాల్లో టీడీపీ నాయకుడు వేజెళ్ల సుబ్బరాజు, వార్డు అధ్యక్షుడు అక్కరబోయిన రాంబాబు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వెంపాడ శ్రీనివాసరెడ్డి, ఉమ్మడి సుజాత, ముప్పిడి, ఉషా, సత్య, మంగా, హేమ పాల్గొన్నారు.



ఎండాడ ఎస్సీ కాలనీలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న జడ్సీ కనకమహాలక్ష్మి

సింహాచలం : యోగా దినోత్సవంలో సింహాచలం దేవస్థానం సిబ్బంది కూడా భాగస్వామ్యం కానున్నారు. కొద్ది రోజులుగా వారు ఈఓ కార్యాలయం భవనంలో యోగా గురువు జి. వెంకటరమణ ఆధ్వర్యంలో ప్రతిరోజూ సాయంత్రం 4 నుంచి గంట పాటు శిక్షణ తీసుకుంటున్నారు.

కొమ్మాది : ప్రతిరోజూ యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి శ్రీనివాస్ అన్నారు. పీఎంపాలెం పరిసర ప్రాంతాల్లో జరిగిన అవగాహన ర్యాలీలో ఆయన మాట్లాడారు. ఈనెల 21న నగరంలో జరిగే యోగా దినోత్సవానికి ప్రధాని మోదీ హాజరుకానుండడంతో ప్రజలంతా కార్యక్రమంలో భాగస్వామ్యులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు గురునాథ్, రెడ్డి సత్యనారాయణ, జనసేన వార్డు అధ్యక్షుడు సంతోష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం/రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో యోగాంధ్ర ర్యాలీలు నిర్వహించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కె. నగేష్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు కె.లక్ష్మి, ఎర్నాయుడు, ఐటీడీపీ అధ్యక్షుడు సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు నూర్జహాన్, సువర్ణ, ఏఎన్ఎంలు పార్వతి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



భీమునిపట్నంలో ర్యాలీ చేస్తున్న జీవీఎంసీ, సచివాలయం సిబ్బంది, నాయకులు



మధురవాడలోని వాంబే కాలనీలో ర్యాలీ చేస్తున్న కూటమి నాయకులు, అధికారులు



9వ వార్డు ర్యాలీలో పాల్గొన్న కూటమి నాయకులు



సింహాచలంలోని ఈఓ కార్యాలయంలో శిక్షణ పొందుతున్న సిబ్బంది

అప్పన్నకు వైభవంగా గరుడ సేవ



గరుడ వాహనంపై స్వామివారు

సింహాచలం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : అప్పన్నస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా సోమవారం గరుడ సేవ, నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనరాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం శాస్త్ర విధానంలో స్వామివారికి కల్యాణ క్రతువు జరిపారు.అంతకముందు గోవిందరాజస్వామిని రజిత గరుడ వాహనంపై అధిష్టింపజేసి, భక్తుల గోత్రనామాలతో శ్రీకారం చుట్టి నారసింహ అష్టోత్తర శతనామావళితో అర్చన చేశారు.

తగరపువలసలో సీపీఎం రాస్తారోకో



రాస్తారోకోలో పాల్గొన్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

తగరపువలస, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికులను తొలగించడాన్ని నిరసిస్తూ సీపీఎం జోనల్ కమిటీ సభ్యులు తగరపువలస జాతీయ రహదారిపై సోమవారం రాస్తారోకో నిర్వహించారు. తొలుత చిట్టివలసలోని సీఐటీయూ కార్యాలయం నుంచి తగరపువలస సంత వరకు ర్యాలీ చేసి, అనంతరం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నాలుగున్నరేళ్లుగా కార్మికులు, ప్రజా సంఘాలు పోరాటం చేస్తున్నా... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత రూ. 11,440 కోట్ల ప్యాకేజీ కేంద్రం నుంచి తీసుకువచ్చామని చెబుతున్నారని, అటువంటప్పుడు 3,100 కార్మికుల్ని విధుల నుంచి తొలగించడం ఏమిటని ప్రశ్నించారు. ప్లాంటును బలహీన పరచడానికే ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పి.సూర్యనారాయణ, పెంటరాజు, చిన్నారావు, రాము, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ వాహనాలతో పర్యావరణానికి మేలు : ఎంపీ శ్రీభరత్



బస్సులను ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీభరత్

కొమ్మాది, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఎలక్ట్రికల్ వాహనాల వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందని ఎంపీ శ్రీభరత్ అన్నారు. సోమవారం ఆయన పరదేశిపాలెంలో ఫ్రెష్ బస్సు సంస్థ విశాఖపట్నం నుంచి అమరావతికి నడపనున్న ఎనిమిది నూతన ఎలక్ట్రికల్ బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర సాధనకు కాలుష్య రహిత సమాజం ఎంతో అవసరమన్నారు. ప్రతి నగరంలోనూ వాహన కాలుష్యం అధికంగా ఉందని, కాలుష్యం తగ్గించాలంటే ఎలక్ట్రికల్ వాహనాల వినియోగం ఎంతో అవసరమని తెలిపారు. ఎలక్ట్రికల్ బస్సులకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీ కూడా ఇస్తుందన్నారు. ఫ్రెష్ బస్సు వ్యవస్థాపకులు చిర్రా సుధాకర్, సందీప్ గంబీర్ మాట్లాడుతూ బస్సు భద్రత, మహిళల భద్రత, పరిశుభ్రత, ఆహార నాణ్యత విషయాలను వెల్లడించారు.

పీజీఆర్ఎస్‌కు పది వినతులు

భీమునిపట్నం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జోన్ వన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి పది వినతులు అందాయి. జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు అర్జీలను స్వీకరించారు. భీమిలి బీచ్‌ను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని వినియోగదారుల సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కనకల సన్యాసినాయుడు, రాజేంద్రప్రసాద్ వర్మ కోరారు. రెల్లివీధి, కృష్ణా కాలనీలో తాగునీటి ఎద్దడి, శ్మశాన వాటికలో కనీస సదుపాయాల కల్పన, శిథిలావస్థకు చేరిన సామాజిక మరుగుదొడ్లు, ఇతర సమస్యలపై టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు కుప్పిలి గురుమూర్తి, జలగడుగుల మురళీ వినతిపత్రం అందించారు. కాగా పది అర్జీల్లో పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి 1, ఇంజనీరింగ్ విభాగానికి 6, ప్రజారోగ్య విభాగానికి 3 అందాయని జడ్సీ తెలిపారు.



జడ్సీ అయ్యప్పనాయుడుకు వినతిపత్రం ఇస్తున్న వినియోగదారుల సంఘం సభ్యులు

వైభవంగా పానీహాటీ ఉత్సవం



శ్రీకృష్ణ, బలరాముల ఉత్సవ విగ్రహాలకు పాలాభిషేకం

భీమునిపట్నం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గోస్తనీ సాగర సంగమంలో హరేకృష్ణ మూవ్మెంట్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం పానీహటీ ఉత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీకృష్ణ, బలరాముల విగ్రహాలకు పాలాభిషేకం, పుష్పాభిషేకం, సప్త నదుల నుంచి సేకరించిన జలాలతో, పలు పండ్ల రసాలతో అభిషేకాలు జరిపారు. అనంతరం శ్రీకృష్ణ, బలరాముల విగ్రహాలకు తెప్పోత్సవం జరిపారు. ఈ సందర్భంగా హరేకృష్ణ మూవ్మెంట్ ప్రతినిధులు మాట్లాడుతూ చిదా దహియా మహోత్సవం, పాణిహటీ ఉత్సవం ప్రాధాన్యతను భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు నుసరాపు కామేశ్వర మాధవశాస్త్రి, ఖైలపల్లి షణ్ముఖరావు, గంటా నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథస్వామికి జేష్ఠాభిషేకం రేపు

భీమునిపట్నం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జగన్నాథస్వామి ఆలయంలో సుభద్ర బలభద్ర సహిత జగన్నాథస్వామికి ఈనెల 11న జేష్ఠాభిషేకాలు నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకుడు రొంపిచెర్ల సింగరాచార్యులు తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.ఆ రోజు ఉదయం 7 గంటల నుంచి ఆలయంలో ఈ కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని కోరారు. అలాగే 26న స్వామివారి నేత్రోత్సవం, 27 నుంచి జగన్నాథస్వామి రథోత్సవాలు ప్రారంభమవుతాయని ఆయన చెప్పారు.

నిత్యావసర సరకులు పంపిణీ

భీమునిపట్నం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చేపల తిమ్మాపురంలో మత్స్యకార మహిళలకు ది విశాఖపట్నం టౌన్ ఫిషర్ ఉమెన్ డ్రై ఫిష్ కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షురాలు మారుపల్లి పార్వతమ్మ బియ్యం, ఇతర నిత్యావసర సరకులను సోమవారం అందజేశారు. వీటిని 4వ వార్డు టీడీపీ అధ్యక్షుడు పాసి నరసింగరావు, సొసైటీ ముఖ్య సలహాదారు మారుపల్లి అమరనాథ్, మత్స్యకార నాయకులు గరికిన ఎల్లయ్య, నరసింగరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు.

క్రీడలతో శారీరక ఉల్లాసం

భీమునిపట్నం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తిత్వ వికాసానికి, శారీరక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. పట్టణంలోని సిడార్ పాఠశాలలో మాస్టర్ రెమో యాదవ్ సారథ్యంలో డ్రాగన్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల రోజులుగా నిర్వహించిన కరాటే వేసవి శిక్షణ శిబిరం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా నూకరాజు క్రీడాకారులకు బెల్టులు అందించారు. ఈ కార్యక్రమంలో కరాటే కోచ్ రెమో యాదవ్, పాఠశాల ప్రిన్సిపాల్ స్వర్ణ, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

భీమునిపట్నం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం మ్యాజిక్ బస్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించి, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, జూనియరు కళాశాల ప్రిన్సిపాల్ రామప్రసాద్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం పొన్నగంటి రమణ, వినియోగదారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కనకల అప్పలనాయుడు,మ్యాజిక్ బస్ ప్రతినిధులు దూడ రమేశ్, స్కూల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పైడితల్లమ్మకు ప్రత్యేక పూజలు

సింహాచలం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : అడివివరం గ్రామ దేవత పైడితల్లమ్మ ఉత్సవాల్లో భాగంగా సోమవారం గంట దీపారాధన చేశారు. అమ్మవారి శతకం పట్టు వద్ద ఆలయ పూజారి వంశీయులు ప్రత్యేక పూజలు చేసి, గరగలను పూజారి, భక్తులు శిరస్సున దాల్చి ప్రధాన వీధుల్లో తిరువీధి నిర్వహించారు. మార్గమధ్యలో భక్తులు గంట దీపాలు వెలిగించి పూజలు చేసి నీరాజనాలిచ్చారు. కాగా తొలేళ్ల పురస్కరించుకుని ఏర్పాటు చేసిన శాస్త్రీయ నృత్యాలు భక్తులను అలరించాయి. సింహాచలం ప్రధాన కూడలిలో సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం పెందుర్తి ప్రాంతానికి చెందిన నిర్మలా నృత్యనికేతన్, పెదగంట్యాడ ప్రాంతానికి చెందిన నాట్యారాధన సంస్థలకు చెందిన కళాకారులు పలు ఆధ్యాత్మిక పాటలకు నృత్య ప్రదర్శనలు అద్భుతంగా ఇచ్చారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

పద్మనాభం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : యువకుడు అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు చేసినట్టు పద్మనాభం పోలీసులు సోమవారం చెప్పారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని విజయరాంపురం గ్రామానికి చెందిన రాంబోతు యుగంధరరావు (25) తన తల్లిదండ్రులు ఉపాధి పనులకు వెళ్లిన సమయంలో ఈనెల 4న వ్యక్తిగత కారణాలతో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. పలుచోట్ల వెతికినా ఆచూకీ దొరకలేదు. యువకుడి తండ్రి రాము నాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

గెడ్డ వాగు ఆక్రమణపై ఫిర్యాదు

భీమునిపట్నం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొల్లల తిమ్మాపురంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ప్రహరీ గోడ నిర్మించిన వారిపై చర్యలు తీసుకోవాలని మంగమారిపేట టీడీపీ నాయకుడు సూరాడ నరసింగరావు కోరారు. ఈమేరకు సోమవారం ఆయన తహసీల్దార్ రామారావుకు వినతిపత్రం అందించారు. కాపులుప్పాడ రెవెన్యూ సర్వే నంబర్లు 332/1, 346, 347/1లో ప్రభుత్వ గెడ్డ వాగు 30 సెంట్లును గుర్తు తెలియని వ్యక్తులు ఆక్రమించి, ప్రహరీ నిర్మించారని తెలిపారు. ఎంతో విలువైన ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రభుత్వ స్థలంలో రిసార్ట్

» ఆలస్యంగా గుర్తించిన రెవెన్యూ అధికారులు » హెచ్చరిక బోర్డు ఏర్పాటు

సాగర్‌నగర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : సాగర్‌నగర్ బీచ్ రోడ్డుకు ఆనుకుని నిర్వహిస్తున్న రిసార్ట్ ప్రభుత్వ స్థలంలో ఉన్న ట్టు చినగదిలి రూరల్ రెవెన్యూ అధికారు లు ఆలస్యంగా గుర్తించారు. తహసీల్దార్ పాల్‌కిరణ్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది సోమవారం అక్కడ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. స్థానికుల ఫిర్యాదు మేరకు అధికారులు పరిశీలన చేసి, ఈ చర్యలు తీసుకున్నారు. కొన్నేళ్లుగా ప్రభుత్వ భూమిలో రిసార్ట్ ఏర్పాటు చేసి వ్యాపారాలు సాగిస్తున్నా,, అధికారులు గుర్తించకపోవడం పట్ల పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.

ఉమ్మడి విశాఖలో 12 మంది తహశీల్దార్ల బదిలీ

... 5వ పేజీ తరువాయి

ఎంఎస్ హరేంధిరప్రసాద్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖ జిల్లాలో పెందుర్తి, ఆనందపురం, గాజువాక, ములగాడ, సీతమ్మధార తహశీల్దార్లను బదిలీ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి ఐదుగురు తహశీల్దార్లను విశాఖ, అనకాపల్లి జిల్లాలకు కేటాయించగా, అనకాపల్లి నుంచి ఒకరిని అల్లూరి జిల్లాకు, విశాఖ జిల్లా నుంచి ఇద్దరిని అనకాపల్లి జిల్లాకు బదిలీ చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న తహశీల్దార్ల విషయంలో కలెక్టర్ ఎవరు ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిక్కచ్చిగా వ్యవహరించినట్టు తెలిసింది.

జడ్పీలో 75మందికి బదిలీ

జిల్లా ప్రజాపరిషత్ పరిధిలో ఎనిమిది కేడర్‌లలో 75మందిని బదిలీ చేశారు. జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, సీఈవో పి.నారాయణ మూర్తి ఆధ్వర్యంలో జడ్పీ హాలులో బదిలీల కౌన్సెలింగ్ సోమవారం నిర్వహించారు. ఐదుగురు ఎంపీడీవోలు, ఐదుగురు ఏవోలు, నలుగురు సీనియర్ అసిస్టెంట్లు, 11 మంది జూనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు టైపిస్టులు, 12 మంది రికార్డు అసిస్టెంట్లు, 30 మంది ఆఫీస్ సబార్డినేట్లు, ఆరుగురు నైట్‌వాచ్‌మెన్‌ను బదిలీ చేశారు.

జలవనరుల శాఖలో 100 మంది...

జలవనరుల శాఖ విశాఖ సర్కిల్ పరిధిలో 100 మందికిపైగా వివిధ కేడర్ ఉద్యోగులను బదిలీచేశారు. ఎస్ఈ స్వర్ణకుమార్ నేతృత్వంలో సర్కిల్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం బదిలీలు చేశారు. కౌన్సెలింగ్ నిర్వహించకుండా బదిలీలు కోరుకునే ఉద్యోగుల నుంచి ఆప్షన్ ఫారాలు తీసుకుని తరువాత బదిలీ చేశారు.అయితే గ్రీవెన్స్ చెప్పుకునేందుకు తమను ఎస్ఈ ఛాంబర్‌లోకి అనుమతించలేదని కొందరు ఉద్యోగులు వాపోయారు. ఒకే చోట ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న ఉద్యోగులను బదిలీ చేశారు.అయితే ఎమ్మెల్యేల నుంచి సిఫారసు లేఖలు తెచ్చుకున్నవారికి బదిలీల్లో ప్రాధాన్యత ఇచ్చారనే వాదన వినిపిస్తున్నది.

భీమిలి హౌసింగ్ ఈఈగా సూరిబాబు

శ్రీకాకుళం జిల్లా టెక్కలి హౌసింగ్ డీఈ సూరిబాబుకు పదోన్నతి కల్పించి భీమిలి డివిజన్ ఈఈగా బదిలీ చేశారు. ఇంకా విశాఖ హౌసింగ్ కార్యాలయంలో పలువురికి బదిలీలు అయ్యాయి. గాజువాక ఏఈ గోపాలకృష్ణను జిల్లా కార్యాలయానికి బదిలీ చేసి అక్కడ పనిచేస్తున్న ప్రసాద్‌ను గాజువాకకు బదిలీ చేశారు. భీమిలి ఏఈ సెలవుపై వెళ్లడంతో అతని స్థానంలో పెందుర్తి ఏఈ దీపక్‌ను బదిలీ చేసి అతని స్థానంలో పెందుర్తి రూరల్ ఏఈ నాగేశ్వరరావును నియమించారు.

తలుపులు మూసి ట్రెజరీలో బదిలీలపై కసరత్తు

జిల్లా ట్రెజరీ కార్యాలయంలో బదిలీల్లో అవకతలను సరిచేయడానికి సోమవారం మరోసారి అధికారులు సమావేశమయ్యారు. బదిలీలకు 15 మందితో నియమించిన కమిటీని రద్దుచేసి ఆరుగురితో మరో కమిటీ వేశారు. మూడు జిల్లాల డీటీవోలు, ఏటీవోలతో కూడిన కమిటీ సోమవారం మధ్యాహ్నం చర్చించారు. సాయంత్రం అయిన తరువాత డీటీవో చాంబర్ తలుపులు మూసివేసి రెండు, మూడుగంటలపాటు సుదీర్ఘంగా కసరత్తు చేశారు. అయినా రాత్రి పదిగంటలైనా బదిలీ ఉత్తర్వులు వెలువడలేదు. నాలుగు రోజుల క్రితం 34 మందిని బదిలీ చేయడం వివాదమైంది. దీనిపై 'ఆంధ్రజ్యోతి' కథనాలు ప్రచురించింది. దీనిపై ఉన్నతాధికారులు అప్రమత్తమై 34 మంది బదిలీల్లో లోపాలు సవరించాలని ఆదేశించడంతో సోమవారం భేటీ అయిన కమిటీ తమ నిర్ణయాన్ని వెల్లడించలేదు. బహుశా అర్ధరాత్రి తరువాత బదిలీ ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని ఉద్యోగులు భావిస్తున్నారు.

ముగిసిన బదిలీల జాతర

ప్రభుత్వ శాఖల్లో సోమవారం అర్ధరాత్రికి బదిలీల హడావిడి ముగిసింది. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా అనేక శాఖల్లో బదిలీలు చేపట్టారు. బదిలీలకు సోమవారంతో గడువు ముగిసింది. ఈ పర్యాయం కొన్ని శాఖల్లో కౌన్సెలింగ్ నిర్వహించగా, మరికొన్ని శాఖల్లో ఉద్యోగుల ఆప్షన్ మేరకు బదిలీలు చేశారు. ఒకేచోట ఐదేళ్లు నిండిన ఉద్యోగులను విధిగా బదిలీ చేశారు. ఈ పర్యాయం ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలు ఎక్కువగా అధికారులకు చేరాయి. దీంతో కొన్ని శాఖల్లో బదిలీలపై కొంత ప్రతిష్ఠంభన, ఇబ్బంది ఎదురయ్యాయి. కొందరు అధికార పార్టీ నేతలు.. బదిలీలకు సంబంధించి సిఫారసు లేఖలు ఇప్పిస్తామని సొమ్ములు వసూలు చేశారనే ఆరోపణలున్నాయి.

మార్కెటింగ్ శాఖ ఏడీగా కిశోర్

విశాఖపట్నం వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా కేవీఆర్ఎన్ కిశోర్ నియమితులయ్యారు. బదిలీల్లో భాగంగా విజయవాడ మార్క్‌ఫెడ్‌లో పనిచేస్తున్న ఆయనను విశాఖలో ఏడీగా వేశారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన యాసిన్‌ను శ్రీకాకుళం జిల్లా హిర మండలానికి ఏడీగా బదిలీ చేశారు. విశాఖపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీగా పనిచేస్తున్న పి.పాపారావును విజయవాడ మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీ చేశారు.

సూపర్‌బజార్ ఎండీగా శ్రీరామ్మూర్తి

సూపర్‌బజార్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పార్వతీపురం మన్యం జిల్లా సహకార అధికారి టి.శ్రీరామ్మూర్తిని నియమించారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఎండీ పోస్టులో డిప్యూటేషన్ ప్రాతిపదికగా శ్రీరామ్మూర్తిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. సూపర్‌బజార్ స్థలం తనఖా వ్యవహారంలో ఇక్కడ ఎండీగా ఉన్న రామకృష్ణరాజును సస్పెండ్ చేశాక విశాఖ డీసీవో ప్రవీణ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు.

బీసీ కార్పొరేషన్ ఈడీగా శంకరరావు

కృష్ణా జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న జె.శంకరరావు జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీగా నియమితులయ్యారు. ఆయన రెండు రోజుల్లో బాధ్యతలు చేపడతారు. అలాగే జిల్లా బీసీ సంక్షేమాధికారిగా ఉన్న శ్రీదేవి అనకాపల్లికి బదిలీ కాగా, అక్కడ పనిచేస్తున్న రాజేశ్వరి ఇక్కడకు బదిలపై రానున్నారు.

తూనికలు, కొలతలశాఖ జాయింట్ కంట్రోలర్‌గా గోపీకృష్ణారెడ్డి

తూనికలు, కొలతలశాఖ జాయింట్ కంట్రోలర్‌గా పనిచేస్తున్న జి.రాజేశ్‌కుమార్‌కు ఏలూరు జాయింట్ కంట్రోలర్‌గా బదిలీ అయింది. ఆయన స్థానంలో కర్నూలులో జాయింట్ కంట్రోలర్‌గా పనిచేస్తున్న గోపీకృష్ణారెడ్డి ఇక్కడకు రానున్నారు.

కాంట్రాక్టు కార్మికుల తొలగింపు చట్ట విరుద్ధం

... 5వ పేజీ తరువాయి

శిబిరాన్ని పోలీసులు స్వాధీనం చేసుకోవటం చూడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు కార్మికుల తొలగింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయడంతో పాటు ఇప్పటికే తొలగించిన వారిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని, స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేయాలని వారు డిమాండ్ చేశారు. 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారామ్ మాట్లాడుతూ స్టీలుప్లాంటును విక్రయించాలన్న నిర్ణయాన్ని కేంద్రం విరమించుకోలేదని, కార్మికులను తగ్గించి ప్రైవేటు వాళ్లకు అప్పగించేందుకు కుట్ర జరుగుతుందని ఆరోపించారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాలకులు కొమ్ముకాయడం సమంజసం కాదన్నారు. ప్లాంటుకు సొంత గనులు కేటాయించి, సెయిల్‌లో విలీనం చేస్తేనే సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. సీఐటీయూ ప్లాంట్ కార్యదర్శి రామస్వామి, ఇంటక్ నాయకుడు నీరుకొండ రామచంద్రరావులు మాట్లాడుతూ కార్మికులకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వాలకు పతనం తప్పదన్నారు. ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు రమణమూర్తి, సీపీఎం నాయకుడు కేఎం శ్రీనివాస్‌లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలో ఇంత దారుణంగా కార్మికులను తొలగించడం మునుపెన్నడూ చూడలేదన్నారు. పోరాటాలను, నాయకులను అణచివేయాలని చూస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. కాంట్రాక్టు లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే స్టీల్‌ప్లాంటును కాపాడతామన్న పాలకులు ఇప్పుడు కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తుంటే చోద్యం చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. కార్యక్రమంలో వైటీ దాస్, శ్రీనివాసరాజు, రాజు, మసేను, కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ ఇన్‌చార్జి సీఈగా పల్లంరాజు

... 5వ పేజీ తరువాయి

అవకాశం వస్తుందని ఎవరూ ఊహించలేదు. పైగా ఎస్ఈ కేడర్ కలిగిన అధికారికి ఇన్‌ఛార్జి బాధ్యతలను అప్పగించాలనుకున్నాసరే మరో మూడు నెలల్లో పదవీ విరమణ చేయనున్న నీటి సరఫరా విభాగం ఎస్ఈ కేవీఎస్ రవికి చాన్స్ దక్కుతుందని పలువురురు భావించారు. శివప్రసాదరాజు పదవీ విరమణ చేశాక కూడా రవికే ఇన్‌చార్జిగా తాత్కాలికంగా బాధ్యతలను అప్పగించారు. ఒకవేళ పూర్తిస్థాయి సీఈని నియమించకపోతే రవికే పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తారని భావిస్తున్న తరుణంలో జీవీ పల్లంరాజుకు బాధ్యతలు ఇవ్వడం చర్చనీయాంశంగా మారిందది. నగరానికి చెందిన ఒక ప్రజాప్రతినిధి పల్లంరాజు వెనుక ఉండి రాష్ట్ర పురపాలక శాఖలో చక్రం తిప్పారని, అందువల్లే పరిశీలనలో లేని పల్లంరాజుకు అవకాశం దక్కిందని జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగంలో ప్రచారం జరుగుతోంది.

లోకేశ్‌కు ఘన స్వాగతం

... 5వ పేజీ తరువాయి

బాలవీరాంజనేయస్వామి, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జి, మేయర్ పీలా శ్రీనివాస్, తదితరులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలు సమస్యలకు సంబంధించి ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వాటిని పరిష్కరిస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు.



ఎంపీ శ్రీభరత్‌తో మంత్రి లోకేశ్

విశాఖ పోర్టులో డ్రైవర్ హత్య

... 5వ పేజీ తరువాయి

ప్రతినిధులు గుర్తించారు. ఆ లోడ్‌లను లారీడ్రైవర్ సన్యాసిరావు, సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న అహ్మద్ కలిసి బయటకు తరలించేశారనే అనుమానంతో వారిద్దరిని సోమవారం పోర్టులోని కంపెనీ కార్యాలయంలో నిర్బంధించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వారికి చిత్రహింసలు పెట్టారు. సెక్యూరిటీ ఇన్‌చార్జిగా కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ కలిగివున్న లాగన్‌ను నియమించిన యాజమాన్యం.. అతనితో వారిద్దరినీ ఇనుప రాడ్లులతో కొట్టించింది. ఆ దెబ్బలకు తాళలేక ఇద్దరూ స్పృహ తప్పి పడిపోవడంతో కంపెనీ ప్రతినిధులు సోమవారం రాత్రి కేజీహెచ్‌కు తరలించారు. అయితే అప్పటికే సన్యాసిరావు మృతి చెందినట్టు వైద్యులు స్పష్టం చేశారు. అహ్మద్ గాయాలతో చికిత్సపొందుతున్నారు. దీనిపై సమాచారం అందిన వెంటనే హార్బర్ సీఐ సింహాద్రినాయుడు తమ సిబ్బందితో కేజీహెచ్‌కు వెళ్లి దర్యాప్తు ప్రారంభించారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని సీఐ తెలిపారు.

ఇంటర్ సర్వీస్ ఆక్వాటిక్స్ ఛాంపియన్ ఇండియన్ నేవీ

విశాఖపట్నం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : తూర్పు నావికాదళం విశాఖపట్నం ప్రధాన కార్యాలయం నిర్వహించిన 74వ ఇంటర్ - సర్వీస్ ఆక్వాటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ఇండియన్ నేవీ విజేతగా నిలిచింది.ఇండియన్ ఆర్మీ నుంచి రెండు జట్లు, నేవీ నుంచి ఒక జట్టు, ఎయిర్ ఫోర్సు నుంచి ఒక జట్టు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. ఐదు రోజులు పాటు జరిగిన స్విమ్మింగ్, స్ప్రింగ్ బోర్డ్, హైబోర్డు డైవింగ్ పోటీలు సోమవారంతో ముగిశాయి.ముగింపు కార్యక్రమానికి తూర్పు నావికాదళం చీఫ్ స్టాఫ్ ఆఫీసర్ (ఆపరేషన్స్) రియర్ అడ్మిరల్ షాంతను ఝా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

కబ్జా భూములకు పట్టా రద్దు చేయాలి

» సామాజిక కార్యకర్త చేకూరి రజని

ఆరిలోవ, జూన్9: (ఆంధ్రజ్యోతి) పార్కుస్థలాన్ని కబ్జా చేసి ప్రభుత్వాన్ని మోసం చేసి పొందిన పట్టాలను రద్దు చేయాలని సామాజిక కార్యకర్త చేకూరి రజని రూరల్ మండల తహసిల్దార్ పాల్‌కిరణ్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కబ్జా చేసిన స్థలాలకు క్రమబద్ధీకరణ నిలిపి వేయాలని, ప్రభుత్వం కళ్లుగప్పి మధురవాడ స్వతంత్ర నగర్‌లో బ్రహ్మంగారి ఆలయం దగ్గర పార్కు ఆక్రమించుకుని నకిలీ పట్టాలు పొందారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. మరికొన్ని ప్రాంతాల్లో స్థలాలను ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు.

రహదారి నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటరు మంగవేణి

ఎం.వి.పి.కాలనీ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 18వ వార్డు పరిధిలో రూ.ఎనిమిది లక్షలతో నిర్మించనున్న రహదారి పనులకు వార్డు కార్పొరేటర్ గొలగాని మంగవేణి పోలరావు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ రహదారి ఎంవీపీ కాలనీ మూడో సెక్టరులో జీవీఎంసి నిధులతో నిర్మిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో జీవీఎంసి అధికారులు, వార్డు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

విజన్ డాక్యుమెంట్‌పై సీఎం దిశానిర్దేశం

» వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన విప్ గణబాబు, అధికారులు


జడ్పీ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన గణబాబు, అధికారులు

వేపగుంట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించిన 2047 విజన్ డాక్యుమెంట్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడ సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వేపగుంట జోనల్ కార్యాలయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ విజన్ డాక్యుమెంట్‌కు అనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. పి-4 విధానంలో పేదలను అభి వృద్ధి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఆయా అంశాలకు సంబంధించి ప్రతిపాదనలను పంపించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ విప్ పి.గణబాబు, స్పెషల్ ఆఫీసర్, డిప్యుటీ కలెక్టర్ మాధవి, జోనల్ కమిషనర్ కె.హైమావతి, డీఈ ప్రవీణ్‌కుమార్, ఏసీపీ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **హౌస్‌ఫుల్-3** : రమాదేవి
- **గేంబ్లర్స్** : శారద
- **గది** : రమాదేవి
- **థగ్ లైఫ్** : మెలోడి, సంగం, కామేశ్వరి, శ్రీరామా, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)
- **భైరవం**: జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక)
- **సింగిల్** : గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 20, టమాటా 20, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 22, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 36, బీరకాయలు 40, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 17, క్యారెట్ 44 దొండకాయలు 28, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)10, మునక్కాడలు(కిలో) 70, అల్లం (పాతది)52, బరబాటి34, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో)70, బద్దచిక్కుడు 44 ,దోస కాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 110, కీరదోస 34, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 38 చిలగడదుంపలు 32, కంద 64, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 40, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4 , చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4,మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, క్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 30,జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	87
లైవ్ ధర	107
విత్ స్కిన్	184
స్కిన్‌లెస్	194

యోగాంధ్రపై విస్తృత అవగాహన ర్యాలీలు

ఆరిలోవ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న అంతార్జాతీయ యోగా దినోత్సవం పుస్కరించుకుని జీవీఎంసీ 12వ వార్డులో యోగాంధ్రపై అవగాహన ర్యాలీ సోమవారం నిర్వహించారు. యోగా వల్ల శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటామని తద్వారా అనేక రోగాలకు దూరంగా ఉంటామనే అవగాహన కల్పించారు. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరు యోగా చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో 12 వ వార్డు కూటమి నాయకులు పాల్గొన్నారు.


ర్యాలీ చేస్తున్న నగేశ్ కుమార్, సచివాలయ సిబ్బంది

వెంకోజీపాలెంలో

వెంకోజీపాలెం: ఈ నెల 21న నగరంలో నిర్వహించనున్న 11వ ప్రపంచ యోగా డే సందర్భంగా సోమవారం 15వ వార్డులో కూటమి నాయకులు యోగాపై అవగాహన ర్యాలీని చేపట్టారు. పాత వెంకోజీపాలెం రామాలయం నుంచి ఉమానగర్ మీదుగా కొత్త వెంకోజీపాలెం వరకు ఈ ర్యాలీని కొనసాగించారు. వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, 15వ వార్డు టీడీపీ అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, బోర ధనరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కూటమి శ్రేణులు యోగా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఏఈ భాగ్యశ్రీ, సచివాలయం సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పద్మనాభం రూరల్‌లో

పద్మనాభం రూరల్: యోగా సాధన చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటామని మాజీ ఎంపీపీ కాళ్ల నగేశ్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం మద్ది గ్రామంలో యోగాపై ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు యోగా సాధన చేస్తే శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. 21వ తేదీ వరకు ప్రతీ గ్రామంలో యోగాంధ్ర నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బ్రహ్మ, సచివాలయ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న కూటమి శ్రేణులు

బయోడైవర్శిటీ పార్కులో గంధం చెట్ల అపహరణ

పెదవాల్తేరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పెదవాల్తేరులోని బయోడైవర్శిటీ పార్కులో ఆదివారం రాత్రి అరుదైన మొక్కలు శ్రీ గంధం చెట్లను దొంగిలించారని పార్కు వ్యవస్థాపకుడు డాక్టర్ ఎం. రామమూర్తి తెలిపారు. ఈ పార్కు 2002లో స్థాపించామని, ఇప్పటివరకు రెండు వేలకు పైగా వైద్య జాతుల అరుదైన మొక్కలను పెంచుతున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ 23 సంవత్సరాల్లో ఎప్పుడూ దొంగతనం జరగలేదని అన్నారు. మొదటి సారిగా ఆదివారం రాత్రి దక్షిణ భాగంలో కొత్తగా వేసిన కంచెను కట్‌చేసి గుర్తు తెలియని వ్యక్తులు లోపలికి చొరబడి మూడు శ్రీ గంధం చెట్లను నరికి తీసుకు వెళ్లారని స్పష్టం చేశారు. ఇంకొ మూడు చెట్లను చిన్నగా కత్తిరించారని అన్నారు. అదేవిదంగా అల్యూమినియంతో తయారు చేసిన నేమ్ ప్లేట్లను దొంగతనం చేశారని చెప్పారు. ఈ దొంగతనం కారణంగా సుమారు రూ.50 వేలు నష్టం కలిగిందని చెప్పారు. ఈ విషయంపై త్రిటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.


నరికిన శ్రీ గంధం చెట్లలు,

దివ్యాంగ విద్యార్థులకు ఉచిత వసతి గృహం

పెదవాల్తేరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పురుష దివ్యాంగులకు 2025-26 సంవత్సరంలో నాలుగవ తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుతున్న విద్యార్థులకు ఉచిత వసతి గృహములను కల్పిస్తున్నామని సహాయ సంచాలకులు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, జె. మాధవి సోమవారం ఒక ప్రకనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెదవాల్తేరు, పెందుర్తిలో వసతి గృహాల్లో చేరిన విద్యార్థులకు ఉచిత భోజనం, వసతితో పాటు కాస్మొటిక్స్, యూనిఫామ్‌లు, నోట్ పుస్తకాలు ప్రభుత్వం ఉచితముగా అందజేస్తుందని తెలిపారు. ఆసక్తి ఉన్న దివ్యాంగ పురుష విద్యార్థులు వైద్య ధృవపత్రము, టీసీ, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆధాయ ధృవపత్రము, బ్యాంక్ అకౌంట్ బుక్, కుల ధ్రువీకరణ, బ్లడ్ గ్రూప్, తల్లిదండ్రులు ఆధార్ కార్డులు, విద్యార్థుల రెండు పాస్‌ఫర్ట్ ఫొటోలతో వసతి గృహాల వార్డెన్‌లను సంప్రదించాలని వివరించారు. విశాఖపట్నం వసతి గృహము 94414 66347, పెందుర్తి వసతి గృహము .950549 4632 నంబర్‌లను సంప్రదించాలన్నారు.

విశాఖ అభివృద్ధికి పార్లమెంట్ నిధులు వినియోగించాలి

రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబురావు


సమావేశంలో మాట్లాడుతున్న గొల్ల బాబురావు

మద్దిలపాలెం, జూన్9 (ఆంధ్రజ్యోతి) : విశాఖ అభివృద్ధికి పార్లమెంట్ నిధులు వినియోగించాలని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబురావు కోరారు. మద్దిలపాలెం వైసీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరాభివృద్ధికి తన శాయశక్తుల కృషి చేస్తానని పేర్కొన్నారు. ఎంపీలకు కేటాయించే నిధులు ఇక్కడ అభివృద్ధి కార్యక్రమాలు చేయడానికి కేటాయిస్తున్నామని అన్నారు. నిరంతరం కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని అన్నారు. జిల్లా అధ్యక్షుడు కేకే రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి అంశంలో ఉత్తరాంధ్రకు అన్యాయం చేస్తోందని, ముఖ్యంగా విశాఖకు అన్యాయం చేస్తోందని అన్నారు. పార్లమెంట్ సాక్షిగా ఉత్తరాంధ్రకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించాలని గొల్ల బాబురావును ఆయన కోరారు. అలాగే గొల్ల బాబురావు మంచి రాజకీయ నాయుకుడగానే కాకుండా మంచి ప్రభుత్వ అధికారిగా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, రవిబాబు, జిల్లా పరిషత్ చైర్మన్ సుభద్ర, సమన్వయకర్తలు వాసుపల్లి గణేశ్ కుమార్, వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్ అమరావతి మహిళలకు క్షమాపణ చెప్పాలి

» టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాష్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న భాను ప్రకాష్ రెడ్డి తదితరులు

పెదవాల్తేరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళలను కించ పరిచేలా మాట్లాడినందుకు జగన్మోహన్ రెడ్డి రాజధాని మహిళలకు క్షమాపణ చెప్పాలని టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాష్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నగర బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో అయన మాట్లాడుతూ అమరావతి మహిళల గురించి అతి నీచంగా మాట్లాడించడంలో కర్త కర్మ క్రియ అంతా జగన్మోహన్ రెడ్డి అని ఆరోపించారు. ఇంత జరిగినా ఇప్పటి వరుకు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రౌడీయిజాన్ని ఉక్కుపాదంతో అణచి వేస్తోందని అన్నారు. జగన్ రెడ్డి పులివెందులకు శాసనసభ్యుడు మాత్రమేనని అన్నారు. వచ్చే ఎన్నికలకు వైసీపీకి 11 స్థానాలు దక్కడం గగమేనని ఆయన అన్నారు. జగన్‌రెడ్డికి జీవితాంతం ఓదార్పు యాత్రలు తప్ప విజయ యాత్రలు ఉండవని ఆయన అన్నారు. అమరావతి మహిళలు సాధారణ వారు కాదని, జోలికి వస్తే మామూలుగా ఉండదని భాను ప్రకాశ్ రెడ్డి హెచ్చరించారు. ఈ సమావేశంలో బీజేపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎస్ పరశురామ రాజు, సుహాసిని ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమాంబ తొలేళ్ల ఉత్సవం


సాంస్కృతిక కార్యక్రమాలతో ఊరేగింపు

వెంకోజీపాలెం, జూన్ 9(ఆంధ్ర జ్యోతి): జీవీఎంసీ 16వ వార్డు పరిధి ఇసుకతోట గ్రామ ఇలవేల్పు శ్రీ కనకదుర్గమాంబ వార్షిక మహోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం తొలేళ్ల ఘనంగా నిర్వహించారు. శ్రీ కృష్ణఉమామహేశ్వర సాయి దుర్గ యాదవ సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవంలో వేకువ జాము నుంచే అమ్మవారికి విశేష అభిషేకాలు జరిపారు. అమ్మవారికి మహిళలు పసుపు, కుంకుమ,చీర, జాకెట్, గాజులను సమర్పించారు. సాయంత్రం పురవీదులలో అమ్మవారి ఊరేగింపు ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సినీ డూబ్ నటులు ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు గొలగాని అప్పారావు, బొట్టా శివ, ఈగల సత్యం, అధ్యక్షుడు ఒమ్మి శ్రీనివాసరావు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 68 వినతులు


వినతులను స్వీకరిస్తున్న అదనపు కమిషనరు డి.వి.రమణమూర్తి

వెంకోజీపాలెం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 68 వినతులు వచ్చాయని జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి పేర్కొన్నారు. సోమవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని పాత సమావేశ మందిరంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఫిర్యాదులను సంభందిత విభాగాల అధికారులు వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. వచ్చిన ఫిర్యాదు మళ్లీ రాకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

అక్రమంగా విక్రయిస్తున్న పుస్తకాలు సీజ్

మద్దిలపాలెం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఇంపల్స్ జూనియర్ కళాశాలలో అక్రమంగా పుస్తకాలు విక్రయించడాన్ని వ్యతిరేకిస్తు సోమవారం ఎస్ఎఫ్ఐ నాయకులు ధర్నా చేశారు. ఇంటర్మీడియట్ పుస్తకాలను వేలాది రూపాయలకు విక్రయించడమే కాకుండా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆందోళన చేశారు. ఈ విషయం తెలుసుకుని ఇంటర్మీడియట్ బోర్డు జిల్లా ప్రాంతీయ పర్యావేక్షణాధికారి(ఆర్ఐవో) మురళీధర్ కళాశాలకు చేరుకున్నారు. అప్పటికే కళాశాల ప్రాంగణంలో వందలాది పుస్తకాలు విక్రయాలకు పెట్టడంతో విస్మయం చెందారు. పుస్తకాలను సీజ్ చేసి కళాశాల యాజామాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అజయ్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు కళాశాలలు రూ. లక్షలు ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. దానికితోడు పుస్తకాలు, యూనిఫాంల పేరుతో వేలాది రూపాయలు వసూలు చేస్తున్నా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థల మీద రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆర్ఐవోకు వినతి పత్రం అందించారు.


ఆర్ఐవో మురళీధర్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సాక్షి కార్యాలయం వద్ద తెలుగు మహిళల ధర్నా

» అమరావతి అభివృద్ధిని చూడలేక దుష్ప్రచారం చేస్తున్న వైసీపీ


» తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి

విశాఖపట్నం/అక్కయ్యపాలెం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతి వేశ్యల కేంద్రంగా మారిపోయిందంటూ అక్కడి మహిళలను కించపరచేలా సాక్షి చానల్‌లో డిబేట్ నిర్వహించడాన్ని నిరసిస్తూ తెలుగు మహిళలు అక్కయ్యపాలెంలోని సాక్షి పత్రికా కార్యాలయం ముందు సోమవారం ధర్నా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి మాట్లాడుతూ అమరావతిని వైసీపీ రాష్ట్ర రాజధానిగా అంగీకరించడం లేదని, అక్కడి అభివృద్ధిని చూడలేక సొంత మీడియా చానల్ సాక్షి టీవీ ద్వారా దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. అంతేకాకుండా ఆ ప్రాంత మహిళలంతా వేశ్యలనే అర్థం వచ్చేలా చర్చా వేదిక నిర్వహించారని ఆరోపించారు. ఈ చర్చను నడిపించిన యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావు, వక్తగా పాల్గొన్న మరో జర్నలిస్ట్ కృష్ణంరాజును తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సాక్షి మీడియాను బ్యాన్ చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజు చిత్రపటాలను, సాక్షి పత్రికలను దహనం చేశారు.

వారిపై రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ఈతలపాక సుజాత, 26వ వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి, నాయకులు కేదారి లక్ష్మి, గణగళ్ల సత్యవతి, యాగాటి ఆదిలక్ష్మి, తోట శ్రీదేవి, గొలగాని సౌజన్య, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి నేత్ర వైద్య పరీక్షలు


నేత్ర పరీక్ష చేయించుకుంటున్న తహసీల్దార్ ఆనంద్‌కుమార్

పెందుర్తి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం గోపాలపట్నంలో గల అగర్వాల్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బందికి ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. తొలుత ఈ శిబిరాన్ని తహసీల్దార్ ఆనంద్ కుమార్ ప్రారంభించారు. కంటి సంరక్షణకు ప్రతిఒక్కరూ అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అనంతరం ఆయనతో పాటు సిబ్బంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అర్జున రావు, నేత్ర వైద్యులు డాక్టర్ ఆకాంక్ష, డాక్టర్ సిద్ధు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌జీటీలకు మ్యాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి

» ఉపాధ్యాయుల సంఘం డిమాండ్


నిరాహార దీక్షలో పాల్గొన్న ఉపాధ్యాయులు

సిరిపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు మ్యాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని విశాఖ జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకుడు డి.గోపినాథ్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపుమేరకు ఉపాధ్యాయులు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి ఎస్‌జీటీలకు మ్యాన్యువల్ కౌన్సెలింగ్ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉమ్మడి జిల్లాల్లో సుమారు 2500 నుంచి 3000 మంది బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. వీరందరూ ప్రస్తుతం ప్రభుత్వం పెట్టిన వెబ్ కౌన్సెలింగ్ విధానంలో ఒక్కొక్క ఉపాధ్యాయుడు నెట్ సెంటర్‌కు వెళ్లి 2500 వెబ్ ఆప్షన్లు పెట్టడం చాలా కష్టమవుతోందని అన్నారు. తెలియని ప్రాంతాలకు బదిలీ అవుతామనే ఆందోళన ఉపాధ్యాయుల్లో ఉన్నదని అన్నారు. మ్యాన్యువల్ కౌన్సెలింగ్ అయితే ఉపాధ్యాయులు తమకు నచ్చిన పాఠశాలను ఎంపిక చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. మంగళవారం జరగనున్న విద్యాభవన ముట్టడికి పెద్ద ఎత్తున విజయవాడకు రావాలని ఐక్యవేదిక ఉపాధ్యాయ సంఘాల నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు పాల్గొన్నారు.

నైపుణ్య, వృత్తి విద్య శిక్షణలో ఇగ్నో పాత్ర కీలకం


ప్రసంగిస్తున్న కేంద్ర విద్యాశాఖ ఆర్థిక సలహాదారు మృత్యుంజయ బెహరా

ఎం.వి.పి.కాలనీ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నైపుణ్య, వృత్తి విద్య శిక్షణలో ఇగ్నో పాత్ర కీలకమని కేంద్ర విద్యాశాఖ ఆర్థిక సలహాదారు మృత్యుంజయ బెహరా అన్నారు. నగరంలోని ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం అధ్యయన కేంద్రాలను ఆయన సోమవారం సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న సేవలు, వాటి ఫలితాలను సమీక్షించారు. కేజీహెచ్ ఆవరణలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలోని ఇగ్నో అధ్యయన కేంద్రాన్ని సందర్శించారు. అక్కడి విద్యార్థులతో మాట్లాడారు. ఇగ్నో సీనియర్ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు, ఉప సంచాలకులు డాక్టర్ ఈ.కృష్ణారావు, నర్సింగ్ కళాశాల ప్రధానాచార్యులు ఎం సత్యవల్లి, మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

సాక్షి చానెల్ లైసెన్స్‌ను రద్దు చేయాలి

» 13వ వార్డు మహిళా సంఘం డిమాండ్

ఆరిలోవ, జూన్9(ఆంధ్రజ్యోతి): అమరావతి వేశ్యలు ఉండే ప్రాంతమని అక్కడ ఉండేవారంతా సంకరజాతి వారని అనుచిత వ్యాఖ్యలు చేసిన సాక్షి చానెల్ లైసెన్స్‌ను రద్దు చేయాలని కోరుతూ సోమవారం ఆరిలోవ 13వ వార్డు మహిళా అధ్యక్షురాలు మజ్జి రమణి బృందంతో కలిసి ఆరిలోవ సీఐకి వినతి పత్రాన్ని అందించారు. మహిళలను అన్ని రంగాలలో ముందుకు తీసుకువెళుతున్న తరుణంలో ఇటువంటి వ్యాఖ్యలు చేసిన సాక్షి చానెల్ కొమ్మినేని శ్రీనివాసరావును కృష్ణంరాజును అరెస్ట్ చేయాలని కోరారు.


పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన మహిళా సంఘం

ఏడాది పాలనపై కూటమి శ్వేతపత్రం ఇవ్వాలి

» తెలుగుశక్తి అధ్యక్షుడు బీవీ.రామ్

సిరిపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఏడాది పాలనలోని కూటమి ప్రభుత్వం అన్ని శాఖలపై శ్వేతపత్రం విడుదల చేయాలని తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ డిమాండ్ చేశారు. సోమవారం హోటల్ మేఘాలయలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పనిచేయని ఎమ్మెల్యేలను వదలుకుంటానని ముఖ్యమంత్రి చంద్రబాబే చెప్పారని అంటే ప్రభుత్వ పరిపాలన బాగోలేదని ఒప్పుకునట్టే అని అన్నారు. దీని గూరించి ప్రముఖ పత్రికలో కూడా ప్రచురించారని చెప్పారు. సమాజమే దేవాలయం అనే ఆశయంతో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని ఏర్పాటు చేశారని, అయితే ఇప్పుడు పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారని ఆయన ఆరోపణలు చేశారు. అమరావతిలో 40 వేల ఎకరాలు గానే ఇప్పటికే రైతులు 33వేల ఎకరాలు ఇచ్చారని అన్నారు. భూములు ఇవ్వవద్దని ఆయన పిలుపునిచ్చారు.

ఎంసెట్ 2025 ఫలితాల్లో నారాయణ ప్రభంజనం


ర్యాంకులు సాధించిన విద్యార్థులతో డీజీఎం డి.హనుమంతరావు

సిరిపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఎంసెట్ 2025 ఇంజనీరింగ్ ఫలితాల్లో నారాయణ హాస్టల్ విద్యార్థులు మరోసారి విజయకేతనం ఎగురవేశారని సంస్థ డీజీఎం డి.హనుమంతరావు తెలిపారు. ఏపీ ఎంసెట్ 2025 ఇంజనీరింగ్ విభాగంలో పీటీ ఆనంద్ చక్రవర్తి 45వ ర్యాంకు, కేవీ అరవింద్‌కుమార్ 64, పి.ఆదివిష్ణు సుబ్రహ్మణ్యం 80వ ర్యాంకు, పి.శ్రీహర్షవర్ధన్ 88వ ర్యాంకు, బి.లక్ష్మీనివాస్ 148, ఎం.పూర్ణసాయి 159, పి.ప్రశాంత్‌కార్తీక్ 166, డి.శ్రీకర్ 181, టీజీ విజయకాశ్యప్ 190, ఎల్.సాయిప్రీతమ్ 218, టీఎస్ఎస్‌బీ చంద్ర అగత్స్య 219 ర్యాంకు, పొట్నూరు కార్తీక్ 224వ, బి.ఈశ్వర తనూజ 296, టి.మనోహనర్ 308, కే.నవదీప్ 325, కే.యశ్వంత్ 355, కేజేకే మహేంద్ర 466, ఎన్వీ సాయినిఖిలేష్ 484, ఏ.స్వాతిక్ 498, వెయ్యిలోపు 4 ర్యాంకులు, 500లోపు 20 ర్యాంకులు, వెయ్యిలోపు 53 ర్యాంకులు సాధించి ఉత్తరాంధ్రలోనే మరోసారి నెంబర్ 1 స్థానాన్ని కైవసం చేసుకుందని పేర్కొన్నారు.

అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో

ఏపీ ఎంసెట్ 2025 అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో డి.సూర్యచరణ్ 10వ ర్యాంకు, వై.సమీర్‌కుమార్ 75, జి.జాహ్నవి 100వ ర్యాంకు, జి.శృతిహాసిని 105, ఎల్.సాయిశ్వేత 117, జె.సహజ 128, టి.విశ్వక్ 162, ఎస్.శ్రీధర్ 202, పి.జుహిత 238, బి.డి.భార్గవి 239, పి.హర్షిత 351, ఎజేఎస్ శ్రీవైష్ణవి 425, జి.నవ్యశ్రీ 496 ర్యాంకులతో పాటు 100లోపు 3 ర్యాంకులు, 500లోపు 13 ర్యాంకులు, వెయ్యిలోపు 17 ర్యాంకులు ఈ ర్యాంకులు సాధించడం వెనుక అధ్యాపకుల కృషి ఎంతో ఉందని పేర్కొన్నారు. విద్యార్థుల మనస్తత్వాన్ని అర్థం చేసుకుని దానికి అనుగుణంగా వారికి వచ్చే సందేహాలకు పరిష్కారం చూపించడం ద్వారా విజయాన్ని సాధించామని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులకు డీజీఎం డి.హనుమంతరావు, డీన్లు, ప్రిన్సిపాళ్లు అభినందనలు తెలిపారు.

వేడుకగా రాట మహోత్సవం



పందిరి రాట మహోత్సవంలో ఆలయ ఈవో రమాభాయి, భక్తులు

డాబాగార్డెన్స్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఉమా చంద్రమౌళీశ్వరస్వామి వార్షిక కల్యాణ రాట మహోత్సవం సోమవారం ఆలయ ఆవరణలో వేడుకగా నిర్వహించారు. డాబాగార్డెన్స్ టూ టౌన్ ఎదురుగా ఉన్న దేవాలయం వద్ద ఈవో జీవీ రమాభాయి సారథ్యంలో మంగళధ్వని వేదమంత్రాలతో శైవాగమ సంప్రదాయంలో అర్చకులు జి.భార్గవశర్మ రాట మహోత్సవాన్ని నిర్వహించారు. పాల్గొన్న మహిళలకు తాంబూలాలు, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ నెల 11న సాయంత్రం ఉమాచంద్రమౌళీశ్వర స్వామి వార్షిక కల్యాణం నిర్వహిస్తారని ఈవో తెలిపారు. పాల్గొనదలచినవారు ఆలయ సిబ్బందిని, అర్చక స్వామిని సంప్రదించాలని కోరారు.

డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జికి ఎమ్మెల్యే వంశీకృష్ణ అభినందన

విశాఖపట్నం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావును విశాఖ దక్షిణ ఎమ్మెల్యే సీహెచ్. వంశీకృష్ణ అభినందించారు. పర్సన్ ఇన్‌చార్జిగా ఇటీవల బాధ్యతలు తీసుకున్న తాతారావు నేతృత్వంలో బ్యాంకు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సోమవారం మర్రిపాలెంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు.



తాతారావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే

ఎంసెట్ ఫలితాల్లో ఎసెంట్ ప్రతిభ

డాబాగార్డెన్స్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎంసెట్ 2025 ఫలితాల్లో ఎసెంట్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని డైరెక్టర్ జి.నాగేశ్వరరావు తెలిపారు. జి.శివరామ్‌నాయుడు రాష్ట్రస్థాయిలో 130వ ర్యాంకు సాధించగా, 38 మంది విద్యార్థులకు 5వేల లోపు ర్యాంకులు వచ్చాయన్నారు. ఉత్తమ ర్యాంకులు 130, 229, 265, 271, 336, 447, 451, 485, 540, 568, 760, 915తో పాటు సుమారుగా 388 మంది విద్యార్థులు ఏపీ ఎప్‌సెట్‌లో అర్హత సాధించారన్నారు. దీని వెనుక డైరెక్టర్‌లు, అధ్యాపక బృందం కృషి, పట్టుదల ఉన్నాయన్నారు.



జి.శివరామ్‌నాయుడు (130వ ర్యాంకు)

ఎమ్మెల్యేతో మర్యాదపూర్వక భేటీ

సీతమ్మధార, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ వాణి సీతమ్మధార బాలయ్యశాస్త్రి లే అవుట్‌లోని బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుతో సోమవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందచేశారు.



విష్ణుకుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డాక్టర్ వాణి

పల్లా సింహాచలంకు నివాళి

సీతంపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మాజీ శాసనసభ్యుడు పల్లా సింహాచలం కన్నుమూయడంతో ఆయన కుమారుడు, గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావును సోమవారం పలువురు టీడీపీ, వైసీపీ నేతలు కలిసి తమ సంతాపాన్ని, సానుభూతిని తెలిపారు. సీతంపేటలోని శ్రీనివాసరావు ఇంటికి వైసీపీ జిల్లా అధ్యక్షుడు కెకె రాజు వెళ్లి పరామర్శించారు. సింహాచలం చిత్రపటానికి నివాళులర్పించారు. టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, అనకాపల్లి జిల్లా ఇంచార్జ్ మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ సీఎం రమేష్, పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్‌లు పల్లా నివాసంలో శ్రీనివాసరావును పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు.

జీవీఎంసీ ఇన్‌చార్జి సీఈగా పల్లంరాజు

... 5వ పేజీ తరువాయి

అవకాశం వస్తుందని ఎవరూ ఊహించ లేదు. పైగా ఎస్ఈ కేడర్ కలిగిన అధికారికి ఇన్‌ఛార్జి బాధ్యతలను అప్పగించాలనుకున్నా సరే మరో మూడు నెలల్లో పదవీ విరమణ చేయనున్న నీటి సరఫరా విభాగం ఎస్ఈ కేవీఎన్ రవికి చాన్స్ దక్కుతుందని పలువురురు భావించారు. శివప్రసాదరాజు పదవీ విరమణ చేశాక కూడా రవికే ఇన్‌ఛార్జిగా తాత్కాలికంగా బాధ్యతలను అప్పగించారు. ఒకవేళ పూర్తిస్థాయి సీఈని నియమించకపోతే రవికే పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తారని భావిస్తున్న తరుణంలో జీవీ పల్లంరాజుకు బాధ్యతలు ఇవ్వడం చర్చనీయాంశంగా మారిందది. నగరానికి చెందిన ఒక ప్రజాప్రతినిధి పల్లంరాజు వెనుక ఉండి రాష్ట్ర పురపాలక శాఖలో చక్రం తిప్పారని, అందువల్లే పరిశీలనలో లేని పల్లంరాజుకు అవకాశం దక్కిందని జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగంలో ప్రచారం జరుగుతోంది.

పాలీసెట్ కౌన్సెలింగ్ ఎప్పుడు?

ఐటీఐ, ఇంటర్‌లో చేరిపోతున్న విద్యార్థులు



ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల



కౌన్సెలింగ్‌కు హాజరైన అభ్యర్థులు

కంచరపాలెం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పాలీసెట్ ఫలితాలు వెలువడి దాదాపు నెల రోజులు గడుస్తున్నా ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభించకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. వాస్తవానికి ఏటా పాలీసెట్ మొదటి విడత ప్రవేశాల ప్రక్రియ మే నెలలో ప్రారంభమై ముగియాల్సి ఉంది. ఈ ఏడాది జూన్ రెండో వారం ముగుస్తున్నా నేటికీ సాంకేతిక శాఖ నుంచి షెడ్యూల్ విడుదల కాకపోవడంతో అసహనం వ్యక్తమవుతోంది. మరో వైపు ఇంటర్, ఐటీఐల్లో ప్రవేశాల ప్రక్రియ జరుగుతుండడంతో పలువురు విద్యార్థులు ఆయా కోర్సుల్లో చేరుతుండడంతో పాలిటెక్నిక్ వర్గాల నుంచి కాస్త నిరాశ వ్యక్తమవుతోంది. కౌన్సెలింగ్ షెడ్యూల్ కోసం పలువురు ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ/ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల నుంచి ఏటా సాంకేతిక విద్యా విభాగానికి అందుబాటులో ఉన్న బ్రాంచిలు,సీట్లు వివరాలను పంపాల్సి ఉంటుంది. ఆ వివరాలు సాంకేతిక విద్యాశాఖకు చేరాక వారు పరిశీలన జరిపి ఎన్‌వోసీ మంజూరు చేయాలి. ఈప్రక్రియ ముగిసిన తరువాత కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను సాంకేతిక శాఖ విడుదల చేస్తుంది. ఈ వివరాలు సకాలంలో చేరకపోవడంతో ఎన్‌వోసీలు రాలేదు. దీంతో కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలలో జాప్యం ఏర్పడుతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. సాంకేతిక శాఖ అధికారులు దృష్టి సారించి పాలీసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను త్వరగా విడుదల చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

నేటితో ముగియనున్న ఐటీఐ ప్రవేశాల కౌన్సెలింగ్

కంచరపాలెం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐలో ఈనెల 5 నుంచి ప్రారంభమైన మొదటి విడత ప్రవేశాల ప్రక్రియ మంగళవారం ముగియనుంది. సోమవారం నిర్వహించిన ప్రత్యేక కేటగిరీ అభ్యర్థుల కౌన్సెలింగ్‌కు 100మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో అర్హత, ప్రతిభ ప్రకారం 81 మందికి వివిధ ఐటీఐల్లో సీట్లు కేటాయించినట్టు ఐటీఐల జిల్లా కన్వీనర్ జె.శ్రీకాంత్ పేర్కొన్నారు.మంగళవారం 805 ర్యాంకు నుంచి ఆఖరి ర్యాంకు 1663 వరకు గల అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. మొదటి విడత కౌన్సెలింగ్‌లో ఇప్పటివరకు జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో సుమారు 1000 వరకు సీట్లు భర్తీచేశామని శ్రీకాంత్ తెలిపారు.

'కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి'



నిరసన ప్రదర్శన చేస్తున్న జేఏసీ నాయకులు

డాబాగార్డెన్స్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్‌లో తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను వ్యూహాత్మక విక్రయం పేరిట అమ్మాలని ప్రయత్నాలు ప్రారంభించిన నాటి నుంచి స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం పెద్ద ఎత్తున పోరాడుతున్నామన్నారు. 2021 నుంచి నిరవధిక పోరాటం ఫలితంగా ఒక్క శాతం కూడా ప్రైవేట్‌పరం కాకుండా కాపాడుకోగలిగామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పోలీసుల పెత్తనం పెరిగిందన్నారు. పోలీసుల ద్వారా ఉద్యమాన్ని అణిచివేయాలనుకోవడం ఎవరితరం కాదన్నారు. తొలగించిన కాంట్రాక్టు కార్మికులందరినీ వెంటనే విధుల్లోకి తీసుకోకుంటే, భవిష్యత్‌లో జరిగే పరిణామాలకు స్టీల్ ప్లాంట్ యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి జేఏసీ నాయకులు ఆర్కేఎస్వీ కుమార్, ఎం.మన్మథరావు నాయకత్వం వహించారు. జేఏసీ నాయకులు కనకారావు, దేవా, పద్మ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఐజీఎన్‌వోయు కేంద్రం పనితీరుపై పరిశీలన

విశాఖపట్నం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విశాఖ మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ (ఐజీఎన్‌వోయు) లర్నర్ సపోర్టు సెంటర్‌ను కేంద్ర ఉన్నత విద్యా మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి, ఆర్థిక సలహాదారు మృత్యుంజయ బెహరా సందర్శించారు. కళాశాలలో ఈ సెంటర్ పనితీరును పరిశీలించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల, ఇతర అధ్యాపకులతో సమావేశమై విద్యావిధానంలో తీసుకురావాల్సిన మార్పులు, చేపడుతున్న ఆధునిక పద్ధతులు, విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలు వంటి అంశాలపై చర్చించి, అధ్యాపకుల వివరాలను సేకరించారు. ఈ కేంద్రం పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ డాక్టర్ కెఎల్.శిరీషా, ఐజీఎన్‌వోయూ రీజనల్ డైరక్టర్ డాక్టర్ ధర్మారావు, డిప్యూటీ డైరక్టర్ డాక్టర్ ఇ.కృష్ణారావు, వి.రామచంద్రరాజు, జగన్నాథ, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సినిమాకు ఎస్పీ బాలు ఒక వరం



ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాడిన గీతాల్ని ఆలపిస్తున్న గాయనీగాయకులు

డాబాగార్డెన్స్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తెలుగు సినిమాకు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఒక వరమని పలువురు కళా రంగ ప్రముఖులు పేర్కొన్నారు. డాబాగార్డెన్స్ స్వరార్చన సాంస్కృతిక డీఎస్ఆర్ మెమోరియల్ ఆధ్వర్యంలో ఎస్పీ బాలు జయంతిని పురస్కరించుకుని సినీ సంగీత విభావరి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులు ఫణిస్వామి, రమణమూర్తి, డి.భూపతిరావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వేలాది పాటలను తన మధురమైన గొంతుతో ఆలపించిన బాలు చరిత్రలో నిలిచిపోతారన్నారు. ఆయన భౌతికంగా లేకపోయినప్పటికీ ఆయన స్వరం నిరంతరం తెలుగు ప్రజల గుండెల్లో నిలిచిపోతుందన్నారు. గాయనీ గాయకులు భూపతిరావు, ఎంవీఆర్, నరసింగరావు, కృష్ణంరాజు, లాయర్ నాయుడు, భయ్యా శ్రీనివాస్, రంజిత, సుజాత, స్వాతిక, మధురి, నాగలక్ష్మి, శైలజలు ఎస్పీ గీతాలను మధురంగా ఆలపించారు.

ఇంటర్ సర్వీస్ ఆక్వాటిక్స్ చాంపియన్ ఇండియన్ నేవీ

విశాఖపట్నం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : తూర్పు నావికాదళం విశాఖపట్నం ప్రధాన కార్యాలయం నిర్వహించిన 74వ ఇంటర్ - సర్వీస్ ఆక్వాటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ఇండియన్ నేవీ విజేతగా నిలిచింది. ఇండియన్ ఆర్మీ నుంచి రెండు జట్లు, నేవీ, ఎయిర్ ఫోర్సు నుంచి ఒక్కొక్క జట్టు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. మొత్తం 65 మంది అథ్లెటిక్స్ పాల్గొన్నారు. ఐదు రోజులు జరిగిన స్విమ్మింగ్, స్ప్రింగ్ బోర్డ్, హైబోర్డు డైవింగ్ పోటీలు సోమవారం ముగిశాయి. ఆక్వాటిక్స్ కాంప్లెక్సులో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి తూర్పు నావికాదళం చీఫ్ స్టాఫ్ ఆఫీసర్ (ఆపరేషన్స్) రియర్ అడ్మిరల్ షాంతను ఝా ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

రాష్ట్రంలో నల్ల చొక్కాల ఉద్యమం చేపట్టాలి

- ఏఐబీఎస్పీ జాతీయ కో-ఆర్డినేటర్ డా.జె.పూర్ణచంద్రరావు పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న జె.పూర్ణచంద్రరావు

సీతంపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో రెండు కులాల ఆధిపత్యాన్ని నిలువరించేందుకు తమిళనాడులో పెరియార్ చేపట్టిన నల్ల చొక్కాల ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని పోరాటానికి సన్నద్ధులు కావాలని అఖిల భారత్ బహుజన్ సమాజ్ పార్టీ జాతీయ కో-ఆర్డినేటర్, విశ్రాంత పోలీసు ఉన్నతాధికారి డా.జె.పూర్ణచంద్రరావు పిలుపునిచ్చారు. ద్వారకానగర్‌లోని విశాఖ పౌరగ్రంథాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి పాలన తీరుపై మండిపడ్డారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడలేని పరిస్థితుల్లో ఈ ప్రభుత్వం ఉందని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్ విషయంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులను ఘెరావ్ చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారం వచ్చాక పక్కన పెట్టేశారని పూర్ణచంద్రరావు ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలందరూ ఏకమై రాజకీయ అధికారం కోసం ఉద్యమించాలన్నారు. చట్టసభల్లో రెండు కులాల ఆధిపత్యాన్ని గణాంక సహితంగా వివరించారు. కుల ఆధిపత్య రాజకీయాలకు ప్రత్యామ్నాయం ఆలిండియా బహుజన సమాజ్ పార్టీ అని చెప్పారు. విశాఖ డైమండ్ పార్కు వద్ద ఏఐబీఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. త్వరలోనే కొన్ని జిల్లాలకు కమిటీలు వేస్తామన్నారు. దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరుతూ విజయవాడ జింఖానా గ్రౌండ్‌లో ఈ నెల 30న సాయంత్రం భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కో-ఆర్డినేటర్ బి.పరంజ్యోతి, మాజీ ఎమ్మెల్యే, ప్రెసిడెంట్ లకే రాజారావు, సీనియర్ నాయకుడు ఎన్ఏడీ పాల్, సీనియర్ న్యాయవాది కనకరాజు, ప్రముఖ వైద్యులు డాక్టర్ విజయశంకర్ పాల్గొన్నారు..

విశాఖ పోర్టులో డ్రైవర్ హత్య

... 5వ పేజీ తరువాయి

ప్రతినిధులు గుర్తించారు. ఆ లోడ్‌లను లారీడ్రైవర్ సన్యాసిరావు, సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న అహ్మద్ కలిసి బయటకు తరలించేశారనే అనుమానంతో వారిద్దరిని సోమవారం పోర్టులోని కంపెనీ కార్యాలయంలో నిర్బంధించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వారికి చిత్రహింసలు పెట్టారు. సెక్యూరిటీ ఇన్‌చార్జిగా కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ కలిగివున్న లాగన్‌ను నియమించిన యాజమాన్యం.. అతనితో వారిద్దరినీ ఇనుప రాడ్డులతో కొట్టించింది. ఆ దెబ్బలకు తాళలేక ఇద్దరూ స్పృహ తప్పి పడిపోవడంతో కంపెనీ ప్రతినిధులు సోమవారం రాత్రి కేజీహెచ్‌కు తరలించారు. అయితే అప్పటికే సన్యాసిరావు మృతి చెందినట్టు వైద్యులు స్పష్టం చేశారు. అహ్మద్ గాయాలతో చికిత్సపొందుతున్నారు. దీనిపై సమాచారం అందిన వెంటనే హార్బర్ సీఐ సింహాద్రినాయుడు తమ సిబ్బందితో కేజీహెచ్‌కు వెళ్లి దర్యాప్తు ప్రారంభించారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని సీఐ తెలిపారు.

ఊబకాయమే దీర్ఘకాలిక అనారోగ్యాలకు కారణం

» పద్మవిభూషణ్ డాక్టర్ నాగేశ్వరరెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేసిన డాక్టర్ నాగేశ్వరరెడ్డి, వైద్యరంగంలోని ఇతర ప్రముఖులు

మహారాణిపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఊబకాయం దీర్ఘకాల అనారోగ్య సమస్యలకు, వ్యాధులకు మూలకారణమని సుప్రసిద్ధ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు పద్మవిభూషణ్, డాక్టర్ జి .నాగేశ్వరరెడ్డి అన్నారు. జిల్లా పరిషత్ జంక్షన్‌లోని అంకోసా సమావేశమందిరంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్, మెడికవర్ ఆసుపత్రి సంయుక్తంగా ఏర్పాటు చేసిన వైద్య విద్యా సదస్సులో ఆయన అనేక కీలకాంశాలను వివరించారు. ఊబకాయం నివారణలో పురోగతి ఈఎస్‌జీ నాన్‌సర్జికల్ ఎండోస్కోపిక్ అనే అంశంపై ఆయన ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ ఊబకాయం కారణంగా మధుమేహం, అధిక రక్తపోటు, హృదయ సంబంధిత రుగ్మతలు, వంధ్యత్వం, కీళ్ళ నొప్పులు, శ్వాసకోస సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని డాక్టర్ నాగేశ్వరరెడ్డి చెప్పారు. పిల్లల్లోనూ ఊబకాయం పెరుగుతుండటం ఆందోళనకరమని, ఇది తీవ్రమైన దీర్ఘకాల అనారోగ్య సమస్యలకు దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారని పేర్కొన్నారు. చెన్నై, నాసిక్, హైదరాబాద్ ప్రాంతాల నుంచి వైద్యం, శస్త్రచికిత్స, ఎండోస్కోపిక్, ఊబకాయాన్ని ఎదుర్కోవటానికి ఇంట్రాగ్యాస్ట్రిక్ బెలూన్ పాత్రలపై బహుళ చికిత్సా విధానం, క్లినికల్ ప్రాధాన్యత తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ సభ్యులు డాక్టర్ ఐ.వాణి, ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ నిస్తాల శ్రీనివాస్ , పలు విభాగాలకు చెందిన సుమారు 400 మంది వైద్యులు సదస్సుకు హాజరయ్యారు.

ఎజీఆర్ఎస్‌కు 6 ఫిర్యాదులు



వినతులు స్వీకరిస్తున్న జడ్సీ బి.రాము

జ్ఞానాపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే వినతులను సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని జోన్-5 జోనల్ కమిషనర్ బి.రాము ఆదేశించారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్సు కార్యక్రమంలో ప్రజల నుంచి ఆరు ఫిర్యాదులు స్వీకరించారు. పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి మాధవదారకు చెందిన పి.రవికుమార్ రెండు ఫిర్యాదులు చేశారు. సాకేతపురంలో ఇంటిపన్ను మదింపు, వీఎల్‌టీ విషయమై రెవెన్యూ విభాగానికి షేక్ మస్తాన్, షేక్ నానాజీలు ఫిర్యాదు చేశారు. వెంకటేశ్వర రైల్వే న్యూకాలనీ ప్రాంతంలో అక్రమంగా వేసిన తాగునీటి కనెక్షన్‌ను తొలగించాలని పడాల అప్పారావు నీటి సరఫరా విభాగానికి ఫిర్యాదు చేశారు. అర్జీలు స్వీకరించిన జెడ్సీ బాధ్య అధికారులకు వాటిని పంపారు. ఈఈ ప్రసన్న, ఈఈ దిలీప్, ఏపీడీ పుణ్యవతి, ఆర్‌ఓలు బాబురావు, రాజ్యలక్ష్మి, టీపీఓ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్‌కు ఘన స్వాగతం



ఎంపీ శ్రీభరత్‌ను పలకరిస్తున్న లోకేశ్

... 5వ పేజీ తరువాయి

బాలవీరాంజనేయస్వామి, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జి, మేయర్ పీలా శ్రీనివాస్, తదితరులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలు సమస్యలకు సంబంధించి ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వాటిని పరిష్కరిస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు.

'కాంట్రాక్టు కార్మికుల తొలగింపు చట్ట విరుద్ధం'

... 5వ పేజీ తరువాయి

శిబిరాన్ని పోలీసులు స్వాధీనం చేసుకోవటం చూడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు కార్మికుల తొలగింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయడంతో పాటు ఇప్పటికే తొలగించిన వారిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని, స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేయాలని వారు డిమాండ్ చేశారు.

78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారామ్ మాట్లాడుతూ స్టీలుప్లాంటును విక్రయించాలన్న నిర్ణయాన్ని కేంద్రం విరమించుకోలేదని, కార్మికులను తగ్గించి ప్రైవేటు వాళ్లకు అప్పగించేందుకు కుట్ర జరుగుతుందని ఆరోపించారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాలకులు కొమ్ముకాయడం సమంజసం కాదన్నారు. ప్లాంటుకు సొంత గనులు కేటాయించి, సెయిల్‌లో విలీనం చేస్తేనే సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. సీఐటీయూ ప్లాంట్ కార్యదర్శి రామస్వామి, ఇంటక్ నాయకుడు నీరుకొండ రామచంద్రరావులు మాట్లాడుతూ కార్మికులకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వాలకు పతనం తప్పదన్నారు. ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు రమణమూర్తి, సీపీఎం నాయకుడు కేఎం శ్రీనివాస్‌లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలో ఇంత దారుణంగా కార్మికులను తొలగించడం మునుపెన్నడూ చూడలేదన్నారు. పోరాటాలను, నాయకులను అణచివేయాలని చూస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. కాంట్రాక్టు లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే స్టీల్‌ప్లాంటును కాపాడతామన్న పాలకులు ఇప్పుడు కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తుంటే చోద్యం చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. కార్యక్రమంలో నాయకులు వైటీ దాస్, శ్రీనివాసరాజు, టీవీకే రాజు, మసేను, కనకరాజు, వీవీ రమణ, సోమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి విశాఖలో 12 మంది తహశీల్దార్ల బదిలీ

... 5వ పేజీ తరువాయి

ఎంఎన్ హరేంధిరప్రసాద్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖ జిల్లాలో పెందుర్తి, ఆనందపురం, గాజువాక, ములగాడ, సీతమ్మధార తహశీల్దార్లను బదిలీ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి ఐదుగురు తహశీల్దార్లను విశాఖ, అనకాపల్లి జిల్లాలకు కేటాయించగా, అనకాపల్లి నుంచి ఒకరిని అల్లూరి జిల్లాకు, విశాఖ జిల్లా నుంచి ఇద్దరిని అనకాపల్లి జిల్లాకు బదిలీ చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న తహశీల్దార్ల విషయంలో కలెక్టర్ ఎవరు ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిక్కచ్చిగా వ్యవహరించినట్టు తెలిసింది.

జడ్పీలో 75మందికి బదిలీ

జిల్లా ప్రజాపరిషత్ పరిధిలో ఎనిమిది కేడర్‌లలో 75మందిని బదిలీ చేశారు. జడ్పీ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, సీఈవో పి.నారాయణమూర్తి ఆధ్వర్యంలో జడ్పీ హాలులో బదిలీల కౌన్సెలింగ్ సోమవారం నిర్వహించారు. ఐదుగురు ఎంపీడీవోలు, ఐదుగురు ఏవోలు, నలుగురు సీనియర్ అసిస్టెంట్లు, 11 మంది జూనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు టైపిస్టులు, 12 మంది రికార్డు అసిస్టెంట్లు, 30 మంది ఆఫీస్ సబార్డినేట్లు, ఆరుగురు నైట్‌వాచ్‌మెన్‌ను బదిలీ చేశారు.

జలవనరుల శాఖలో 100 మంది...

జలవనరుల శాఖ విశాఖ సర్కిల్ పరిధిలో 100 మందికిపైగా వివిధ కేడర్ ఉద్యోగులను బదిలీచేశారు. ఎస్ఈ స్వర్ణకుమార్ నేతృత్వంలో సర్కిల్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం బదిలీలు చేశారు. కౌన్సెలింగ్ నిర్వహించకుండా బదిలీలు కోరుకునే ఉద్యోగుల నుంచి ఆప్షన్ ఫారాలు తీసుకుని తరువాత బదిలీ చేశారు. అయితే గ్రీవెన్స్ చెప్పుకునేందుకు తమను ఎస్ఈ ఛాంబర్‌లోకి అనుమతించలేదని కొందరు ఉద్యోగులు వాపోయారు. ఒకేచోట ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న ఉద్యోగులను బదిలీ చేశారు. అయితే ఎమ్మెల్యేల నుంచి సిఫారసు లేఖలు తెచ్చుకున్నవారికి బదిలీల్లో ప్రాధాన్యత ఇచ్చారనే వాదన వినిపిస్తున్నది.

భీమిలి హౌసింగ్ ఈఈగా సూరిబాబు

శ్రీకాకుళం జిల్లా టెక్కలి హౌసింగ్ డీఈ సూరిబాబుకు పదోన్నతి కల్పించి భీమిలి డివిజన్ ఈఈగా బదిలీ చేశారు. ఇంకా విశాఖ హౌసింగ్ కార్యాలయంలో పలువురికి బదిలీలు అయ్యాయి. గాజువాక ఏఈ గోపాలకృష్ణను జిల్లా కార్యాలయానికి బదిలీ చేసి అక్కడ పనిచేస్తున్న ప్రసాద్‌ను గాజువాకకు బదిలీ చేశారు. భీమిలి ఏఈ సెలవుపై వెళ్లడంతో అతని స్థానంలో పెందుర్తి ఏఈ దీపక్‌ను బదిలీ చేసి అతని స్థానంలో పెందుర్తి రూరల్ ఏఈ నాగేశ్వరరావును నియమించారు.

తలుపులు మూసి ట్రెజరీలో బదిలీలపై కసరత్తు

జిల్లా ట్రెజరీ కార్యాలయంలో బదిలీల్లో అవకతలను సరిచేయడానికి సోమవారం మరోసారి అధికారులు సమావేశమయ్యారు. బదిలీలకు 15 మందితో నియమించిన కమిటీని రద్దుచేసి ఆరుగురితో మరో కమిటీ వేశారు. మూడు జిల్లాల డీటీవోలు, ఏటీవోలతో కూడిన కమిటీ సోమవారం మధ్యాహ్నం చర్చించారు. సాయంత్రం అయిన తరువాత డీటీవో చాంబర్ తలుపులు మూసివేసి రెండు, మూడుగంటలపాటు సుదీర్ఘంగా కసరత్తు చేశారు. అయినా రాత్రి పదిగంటలైనా బదిలీ ఉత్తర్వులు వెలువడలేదు. నాలుగు రోజుల క్రితం 34 మందిని బదిలీ చేయడం వివాదమైంది. దీనిపై 'ఆంధ్రజ్యోతి' కథనాలు ప్రచురించింది. దీనిపై ఉన్నతాధికారులు అప్రమత్తమై 34 మంది బదిలీల్లో లోపాలు సవరించాలని ఆదేశించడంతో సోమవారం భేటీ అయిన కమిటీ తమ నిర్ణయాన్ని వెల్లడించలేదు. బహుశా అర్ధరాత్రి తరువాత బదిలీ ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని ఉద్యోగులు భావిస్తున్నారు.

ముగిసిన బదిలీల జాతర

ప్రభుత్వ శాఖల్లో సోమవారం అర్ధరాత్రికి బదిలీల హడావిడి ముగిసింది. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా అనేక శాఖల్లో బదిలీలు చేపట్టారు. బదిలీలకు సోమవారంతో గడువు ముగిసింది. ఈ పర్యాయం కొన్ని శాఖల్లో కౌన్సెలింగ్ నిర్వహించగా, మరికొన్ని శాఖల్లో ఉద్యోగుల ఆప్షన్ మేరకు బదిలీలు చేశారు. ఒకేచోట ఐదేళ్లు నిండిన ఉద్యోగులను విధిగా బదిలీ చేశారు. ఈ పర్యాయం ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలు ఎక్కువగా అధికారులకు చేరాయి. దీంతో కొన్ని శాఖల్లో బదిలీలపై కొంత ప్రతిష్ఠంభన, ఇబ్బంది ఎదురయ్యాయి. కొందరు అధికార పార్టీ నేతలు.. బదిలీలకు సంబంధించి సిఫారసు లేఖలు ఇప్పిస్తామని సొమ్ములు వసూలు చేశారనే ఆరోపణలున్నాయి.

మార్కెటింగ్ శాఖ ఏడీగా కిశోర్

విశాఖపట్నం వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా కేవీఆర్ఎన్ కిశోర్ నియమితులయ్యారు. బదిలీల్లో భాగంగా విజయవాడ మార్క్‌ఫెడ్‌లో పనిచేస్తున్న ఆయనను విశాఖపట్నంలో ఏడీగా వేశారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన యాసిన్‌ను శ్రీకాకుళం జిల్లా హిరమండలానికి ఏడీగా బదిలీ చేశారు. విశాఖపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీగా పనిచేస్తున్న పి.పాపారావును విజయవాడ మార్కెటింగ్ శాఖ డీడీగా బదిలీ చేశారు.

సూపర్‌బజార్ ఎండీగా శ్రీరామ్మూర్తి

సూపర్‌బజార్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పార్వతీపురం మన్యం జిల్లా సహకార అధికారి టి.శ్రీరామ్మూర్తిని నియమించారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఎండీ పోస్టులో డిప్యూటేషన్ ప్రాతిపదికగా శ్రీరామ్మూర్తిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. సూపర్‌బజార్ స్థలం తనఖా వ్యవహారంలో ఇక్కడ ఎండీగా ఉన్న రామకృష్ణరాజును సస్పెండ్ చేశాక విశాఖ డీసీవో ప్రవీణ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు.

బీసీ కార్పొరేషన్ ఈడీగా శంకరరావు

కృష్ణా జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్‌గా పనిచేస్తున్న జె.శంకరరావు జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీగా నియమితులయ్యారు. ఆయన రెండు రోజుల్లో బాధ్యతలు చేపడతారు. అలాగే జిల్లా బీసీ సంక్షేమాధికారిగా ఉన్న శ్రీదేవి అనకాపల్లికి బదిలీ కాగా, అక్కడ పనిచేస్తున్న రాజేశ్వరి ఇక్కడకు బదిలపై రానున్నారు.

తూనికలు, కొలతలశాఖ జాయింట్ కంట్రోలర్‌గా గోపీకృష్ణారెడ్డి

తూనికలు, కొలతలశాఖ జాయింట్ కంట్రోలర్‌గా పనిచేస్తున్న జి.రాజేశ్‌కుమార్‌కు ఏలూరు జాయింట్ కంట్రోలర్‌గా బదిలీ అయింది. ఆయన స్థానంలో కర్నూలులో జాయింట్ కంట్రోలర్‌గా పనిచేస్తున్న గోపీకృష్ణారెడ్డి ఇక్కడకు రానున్నారు.

కాంట్రాక్టు కార్మికుల పయనమెటు?

» పూట గడవటం కష్టంగా ఉందంటున్న ఉపాధి కోల్పోయిన కార్మికులు



స్టీల్‌ప్లాంట్ పరిపాలన భవనం ముందు ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు (ఫైల్)

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఎటువైపు వెళ్లాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. స్టీల్‌ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులు మే 20 నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. కాంట్రాక్టు కార్మికులను తొలగించరాదని, తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. సమ్మె సమయంలో రెండుసార్లు ఆర్‌ఎల్‌సీ సమక్షంలో ఉక్కు యాజమాన్యం, కార్మిక సంఘాల మధ్య చర్చలు జరిగాయి. ఒకసారి యాజమాన్య ప్రతినిధులు హాజరు కాగా, తరువాత జరిగిన సమావేశానికి డుమ్మా కొట్టారు. ఈ పరిస్థితిలో ఏం చేయాలో కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులకు అర్థం కావట్లేదు. నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చినప్పటికీ కొందరు కార్మికులు తమ విధులకు హాజరయ్యారు. తరువాత సమ్మె ప్రాముఖ్యతను కార్మిక నాయకులు వివరించగా చాలా మంది కార్మికులు విధులకు దూరంగా ఉండి నిరసనలో పాల్గొంటున్నారు. రెండు రోజులు చేపట్టిన అడ్మిన్ ముట్టడిలో కార్మిక వర్గం భారీగా పాల్గొంది. ఈ సమయంలోనే కార్మిక నాయకులపై యాజమాన్యం పోలీస్ కేసులు పెట్టింది. దీంతో నిరసనలు చేపట్టేందుకు కార్మికులు ముందుకు రావటం లేదు. చాలా మంది కార్మికులు తమ విధులకు హాజరు కావటంతో యాజమాన్యం నిర్ణయాన్ని విరమించుకుంది. ప్రస్తుతం పనులు, జీతాలు లేక, చేతిలో డబ్బులు ఆడక ఆకలితో అలమటిస్తున్నామని ఉపాధి కోల్పోయిన కాంట్రాక్టు కార్మికులు కంటతడి పెడుతున్నారు. ప్లాంట్‌లో ఉపాధి కోసం పోరాటాలు చేస్తున్నారు. పూట గడవటం కోసం ఇతర పనులకు వెళ్లలేని పరిస్థితిలో ఉన్నారు. కార్మిక నాయకులను యాజమాన్యం అణిచివేయటంతో ప్లాంట్‌లో ఏం జరుగుతుందోనని కార్మిక వర్గం ఆందోళన వ్యక్తం చేస్తోంది. మరికొందరు కార్మికులను తొలగించేందుకు యాజమాన్యం జాబితాను సిద్ధం చేసినట్లు తెలిసింది. దీంతో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న కార్మికులు కూడా తీవ్ర ఆందోళనలో ఉన్నారు. కాంట్రాక్టు కార్మికుల వ్యవహారంపై ప్రజా ప్రతినిధులను కలిసి విన్నవిస్తామని కార్మిక సంఘ నాయకులు పేర్కొన్నారు.

నేడు ఆర్‌ఎల్‌సీ సమక్షంలో చర్చలు

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం, కాంట్రాక్టు కార్మిక సంఘాల మధ్య ఆర్‌ఎల్‌సీ (రీజనల్ లేబర్ కమిషనర్) సమక్షంలో మంగళవారం చర్చలు జరగనున్నాయి. కాంట్రాక్టు కార్మికులు నిరవధిక సమ్మెకు పిలుపుఇచ్చిన నేపథ్యంలో రెండుసార్లు చర్చలు జరిగాయి. ఈ సమావేశాలకు ఉక్కు యాజమాన్య ప్రతినిధులు హాజరుకాలేదు. ప్రస్తుతం కాంట్రాక్టు కార్మికులు నిరవధిక సమ్మె విరమించుకోవటంతో ఇప్పుడు ఏం జరుగుతుందో వేచి చూడాలి. ఈ సారి చర్చల్లో కార్మికుల అనుకూల నిర్ణయం వస్తుందని కార్మికవర్గం ఆసక్తిగా ఎదురు చూస్తోంది. యాజమాన్యం ఎలాంటి హామీ ఇస్తుందోనని కార్మికులు ఎదురు చూస్తున్నారు. కాంట్రాక్టు కార్మికుల తొలగింపు అంశంపై స్పష్టమైన నిర్ణయం ఇప్పటికే చెప్పామని, ఎవరినీ తొలగించబోమని యాజమాన్యం స్పష్టమైన హామీ ఇవ్వాలని కార్మిక నాయకులు కోరుతున్నారు.

డంపింగ్ యార్డ్ ఎత్తివేయాలని ఆందోళన



ప్రజలకు మద్దతుగా పాల్గొన్న కార్పొరేటర్లు గంధం శ్రీనివాస్, బి.గంగారాం

గాజువాక, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 76వ వార్డు రామచంద్రనగర్ ప్రాంతానికి ఆనుకొని ఉన్న డంపింగ్ యార్డ్ ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం 16 గ్రామాల ప్రజలు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. యార్డ్ గేటు ముందు కూర్చొని నినాదాలు చేశారు. ఆందోళన కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గంధం శ్రీనివాస్ మాట్లాడుతూ గడిచిన 15 ఏళ్లుగా స్థానికులు ఆందోళన చేస్తున్నారని, ఈ డంపింగ్ యార్డ్ కారణంగా అనారోగ్యాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించలేదని ఆరోపించారు. ఇకపై మేయర్, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని, పరిష్కరించే వరకు ప్రజల పక్షాన పోరాడతామన్నారు. 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు మాట్లాడుతూ ప్రజల నివాసాల మధ్య ఉన్న డంపింగ్ తరలించేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు త్రినాథస్వామి, వి.నారాయణరావు, డి.రమణ, రమేష్, రామినాయుడు, చిన్నారావు, అన్నపూర్ణ, నాయుడు పాల్గొన్నారు.

బ్రెయిన్ ట్యూమర్‌లపై అవగాహన అవసరం

అక్కిరెడ్డిపాలెం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ ట్యూమర్ (మెదడు కణతులు) లక్షణాలను సకాలంలో గుర్తించి చికిత్స అందించడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ కె.అచ్చియ్యనాయుడు అన్నారు. షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిలో సోమవారం బ్రెయిన్ ట్యూమర్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మెదడులో అసాధారణ ట్యూమర్‌లు పెరగడం వల్ల సున్నిత భాగాలు ఒత్తిడికి గురై ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందన్నారు. అన్ని వయసుల వారిలో కనిపించే కొన్ని ట్యూమర్ లక్షణాలను సకాలంలో గుర్తించి సరైన చికిత్స ద్వారా నయంచేసుకోవచ్చన్నారు. పలువురు వైద్య సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు.

సాక్షి కార్యాలయం వద్ద తెలుగు మహిళల ధర్నా

» అమరావతి అభివృద్ధిని చూడలేక దుష్ప్రచారం చేస్తున్న వైసీపీ

» తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి

విశాఖపట్నం/అక్కయ్యపాలెం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతి వేశ్యల కేంద్రంగా మారిపోయిందంటూ అక్కడి మహిళలను కించపరచేలా సాక్షి చానల్‌లో డిబేట్ నిర్వహించడాన్ని నిరసిస్తూ తెలుగు మహిళలు అక్కయ్యపాలెంలోని సాక్షి పత్రికా కార్యాలయం ముందు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి మాట్లాడుతూ అమరావతిని వైసీపీ రాష్ట్ర రాజధానిగా అంగీకరించడం లేదని, అక్కడి అభివృద్ధిని చూడలేక సొంత మీడియా చానల్ సాక్షి టీవీ ద్వారా దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. అంతేకాకుండా ఆ ప్రాంత మహిళలంతా వేశ్యలనే అర్థం వచ్చేలా చర్చా వేదిక నిర్వహించారని ఆరోపించారు. ఈ చర్చను నడిపించిన యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావు, వక్తగా పాల్గొన్న మరో జర్నలిస్ట్ కృష్ణంరాజును తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సాక్షి మీడియాను బ్యాన్ చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజు చిత్రపటాలను, సాక్షి పత్రికలను దహనం చేశారు. వారిపై రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ఈతలపాక సుజాత, 26వ వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి, నాయకులు కేదారి లక్ష్మి, గణగళ్ల సత్యవతి, యాగాటి ఆదిలక్ష్మి, తోట శ్రీదేవి, గొలగాని సౌజన్య, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పల్లా సింహాచలంకు నివాళి



పల్లా సింహాచలం చిత్రపటం వద్ద నివాళుల ర్పిస్తున్న బొండా జగన్

కూర్మన్నపాలెం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తండ్రి మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం మృతిపై టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. వడ్లపూడిలో సోమవారం పల్లా సింహాచలం చిత్రపటానికి వార్డు టీడీపీ నాయకులతో కలసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు ఎస్ఎస్ విజయరామరాజు, నాయకులు రాజన్‌రాజు, పోతల కృష్ణ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక వికాసం



విద్యార్థులకు ట్రోఫీలు అందజేస్తున్న జీవీఎంసీ డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి

గాజువాక, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): చదువు విజ్ఞానాన్ని పంచితే, క్రీడలు మానసిక స్థైర్యాన్ని పెంచుతాయని డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి అన్నారు. సీనియర్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరం గాజువాకలో సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో సమయాన్ని వృథా చేయకుండా పిల్లల్లో క్రీడాస్ఫూర్తిని నింపాలన్న లక్ష్యంతో ఇటువంటి శిబిరాలు నిర్వహించటం గొప్ప విషయమన్నారు. క్రీడాకారులకు జీవీఎంసీ అన్ని విధాలా సహకారం అందిస్తుందన్నారు. 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, బైపిల్లి గాంధీ, రమణ, రామకృష్ణ, రాజారావు, నగేష్ పాల్గొన్నారు.

సేవలే చిరస్థాయిగా నిలుస్తాయి : సీఐ



సత్కారం పొందిన పోలీసులతో దువ్వాడ సీఐ కె.మల్లేశ్వరరావు

కూర్మన్నపాలెం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా ప్రజలకు పోలీసులు అందించే సేవలే చిరస్థాయిగా నిలుస్తాయని దువ్వాడ సీఐ కె. మల్లేశ్వరరావు అన్నారు. దువ్వాడ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన హెచ్‌.సి. వరహాలు రాజు, హోంగార్డు రత్నకుమార్, వివిధ పోలీస్ స్టేషన్లకు బదిలీ అయినవారిని సోమవారం కూర్మన్నపాలెంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సీఐ మల్లేశ్వరరావు మాట్లాడుతూ పోలీసులు చిత్తశుద్ధితో విధుల్లో పాల్గొని ప్రజల మన్నన పొందాలన్నారు. ఉద్యోగ విరమణ పొందిన వారికి దువ్వాడ పోలీస్ సిబ్బంది రూ.30 వేలు ఆర్థిక ఆసరా అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు డి.శ్రీనివాసరావు, ఎల్.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

యోగా డేను విజయవంతం చేయాలి



క్రాంతినగర్‌లో అవగాహన ర్యాలీలో కార్పొరేటర్ చిన్నా



అగనంపూడిలో మాట్లాడుతున్న కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్

అగనంపూడి/సింధియా, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): యోగా డేను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. సోమవారం అగనంపూడి ప్రాంతంలో కూటమి నేతలు ప్రచారం నిర్వహించారు. గల్లవానిపాలెంలో కార్పొరేటర్ మాట్లాడారు. యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. నేతలు కరణం జగదీశ్, సత్యారావు, సింగిడి సింహాచలం, తాతారావు, బుల్లెట్ రాజు, మాడిశ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. 85వ వార్డు పరిధి ఉక్కు నిర్వాసిత కాలనీల్లో ర్యాలీ నిర్వహించారు. జీవీఎంసీ 63వ వార్డు పరిధి క్రాంతినగర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్పొరేటర్ గల్లా పోలిపల్లి (చిన్నా) మాట్లాడుతూ యోగాపై ప్రజలకు అవగాహన చాలా అవసరమని, 21న వార్డులో జరగనున్న యోగా కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వార్డు అధ్యక్షుడు జెర్రిపోతుల నర్సింగరావు, గుడేల కృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి హేమంత్‌కుమార్‌కు మంత్రి ప్రతిభా పురస్కారం



విద్యార్థికి ప్రశంసా పత్రం అందిస్తున్న బాల వీరాంజనేయస్వామి

అగనంపూడి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం విద్యార్థి జె.హేమంత్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వ ప్రకటించిన షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికయ్యాడు. ఈ ఏడాది పరీక్షా ఫలితాల్లో 950/1000 మార్కులు సాధించాడు. సోమవారం నగరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి నుంచి ప్రతిభా అవార్డు అందుకున్నాడు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జి.సుధాకర్‌బాబు, అధ్యాపక సిబ్బంది ఆ విద్యార్థిని అభినందించారు.

వెంకటాద్రిపై జ్యేష్ఠ పౌర్ణమి రేపు

పెందుర్తి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి వేంకటాద్రి శిఖరంపై కొలువుదీరిన వేంకటేశ్వర ఆలయంలో ఈనెల 11న స్వామి వారికి 1008 నారికేళాలు (కొబ్బరి బొండాలు)తో సహస్రాభిషేకం నిర్వహించనున్నామని ఆలయ అర్చకులు మహర్షి శ్రీనివాసాచార్యులు తెలిపారు. జ్యేష్ఠ నక్షత్రంతో కూడిన పౌర్ణమి సందర్భంగా విశేష పూజలు జరపనున్నామన్నారు. ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి నేత్ర వైద్య పరీక్షలు

పెందుర్తి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం గోపాలపట్నంలో గల అగర్వాల్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బందికి ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. తొలుత ఈ శిబిరాన్ని తహసీల్దార్ ఆనంద్‌కుమార్ ప్రారంభించారు. కంటి సంరక్షణకు ప్రతిఒక్కరూ అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అనంతరం ఆయనతో పాటు సిబ్బంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అర్జున రావు, నేత్ర వైద్యులు డాక్టర్ ఆకాంక్ష, డాక్టర్ సిద్ధు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మర్రిపాలెం ఉడా లేఅవుట్ నూతన కార్యవర్గం

ఎన్ఏడీ జంక్షన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం ఉడా లేఅవుట్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షులుగా మండవ వాసుదేవ రావు, కార్యదర్శిగా సిహెచ్.వి.సురేష్, ఉపాధ్యక్షులుగా కె.రవి, ఎస్.రామారావు, సంయుక్త కార్యదర్శులుగా వి.వి.సూర్యనారాయణ, ఆర్.రాము, కోశాధికారిగా బి.కనకారావు, సభ్యులుగా వై.వి.సత్యనారాయణ, దినేష్, అన్వేష్, సతీష్ కుమార్, రవి తదితదిరులను అంతా ఎన్నుకున్నారు.

2047 విజన్ డాక్యుమెంట్‌పై సీఎం దిశానిర్దేశం

» వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన విప్ గణబాబు, అధికారులు



జడ్పీ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన విప్ గణబాబు, అధికారులు

వేపగుంట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించిన 2047 విజన్ డాక్యుమెంట్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడ సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వేపగుంట జోనల్ కార్యాలయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ విజన్ డాక్యుమెంట్‌కు అనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. పి-4 విధానంలో పేదలను అభివృద్ధి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఆయా అంశాలకు సంబంధించి ప్రతిపాదనలను పంపించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ విప్ పి.గణబాబు, స్పెషల్ ఆఫీసర్, డిప్యూటీ కలెక్టర్ మాధవి, జోనల్ కమిషనర్ కె.హైమావతి, డీఈ ప్రవీణ్‌కుమార్, ఏసీపీ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

కాలభైరవ స్వామి పీఠంలో ముగిసిన విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం



పూర్ణాహుతిలో విశ్వసాయి గురూజీ, నాయకులు

పెందుర్తి రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదగాడిలో నిర్మించిన రాజశ్యామల సమేత స్వర్ణాకర్షణ మహా కాలభైరవ స్వామి పీఠంలో గత మూడు రోజులుగా జరుగుతున్న క్షేత్ర పాలక మహాకాలభైరవ దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. కాలభైరవ ఉపాసకులు విశ్వసాయి గురూజీ పర్యవేక్షణలో శృంగేరి పీఠం వేద పాఠశాల ప్రధానాచార్యులు డాక్టర్ బి.నిర్మల దరహాస్ నేతృత్వంలో వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ క్రతువును నిర్వహించారు. ఆఖరి రోజు గోపూజ, కర్తన్యాసం, కళా హోమాలు తదితరాలను జరిపారు. 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, జడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు, సర్పంచి కేసుబోయిన లావణ్యా త్రినాథ్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు.

'యోగా ప్రతి ఒక్కరి దినచర్యలో భాగం కావాలి'



యోగాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న కార్పొరేటర్ సేనాపతి వసంత

పెందుర్తి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : యోగా ప్రతి ఒక్కరి దినచర్యలో భాగం కావాలని జీవీఎంసీ 97వ వార్డు కార్పొరేటర్ సేనాపతి వసంత అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా చినముషిడివాడలో సోమవారం నిర్వహించిన అవగాహన ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత సేనాపతి శంకర్రావు, డ్వాక్రా మహిళలు, యూసీడీ సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలావుంటే, 96వ వార్డు పెందుర్తిలో నిర్వహించిన యోగాంధ్ర అవగాహన ర్యాలీని తెలుగు యువత వార్డు అధ్యక్షుడు పీలా జితేంద్ర ప్రారంభించారు. యోగా ఆవశ్యకతను ప్రజలు వివరించారు. ఈ కార్యక్రమంలో కిల్లి రమేశ్, ఆళ్ల రమేశ్, పెంటకోట రాజేంద్రప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గాజువాక ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో...

మల్కాపురం : యోగాంధ్రపై గాజువాక డిపో ఆవరణలో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ పి.ప్రవీణ మాట్లాడుతూ యోగా చేయడం వలన ఆరోగ్యంగా ఉండవచ్చునన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు కూడా నయమవుతాయని వివరించారు. అనంతరం పలువురు డ్రైవర్లు, కండక్టర్లు యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సూపర్‌వైజర్లు, యోగా గురువులు రామారావు, సత్యనారాయణ, నాగేశ్వరరావు, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఏడు ఫిర్యాదులు

వేపగుంట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఏడు ఫిర్యాదులు అందాయి. వీటిలో ముఖ్యంగా 90వ వార్డులోని 486 సచివాలయం పరిధిలో ఇంటి నిర్మాణ వ్యర్థాలు కారణంగా ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, 92వ వార్డు గోపాలపట్నం మెయిన్‌రోడ్డులో ఆక్రమ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని పలువురు కోరారు. 94వ వార్డు వేపగుంట జోనల్ కార్యాలయం పక్కన ఉన్న ఎల్‌పీజీ గోదాం సమీపంలో అనధికార ఆక్రమణలపై చర్యలు చేపట్టాలని, సేనాతివానిపాలెంలో యూజీడీ పైప లైన్ సమస్యను పరిష్కరించాలని, 97వ వార్డులో ఇంటిపనులు వేయాలని తదితర ఫిర్యాదులు అందాయని ఏఎంహెచ్‌వో బండారు అప్పలనాయుడు తెలిపారు.

సినిమా గైడ్

- **హౌస్‌ఫుల్-3** : రమాదేవి
- **గేంబ్లర్స్** : శారద
- **గది** : రమాదేవి
- **థగ్ లైఫ్** : మెలోడి, సంగం, కామేశ్వరి, శ్రీరామా, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)
- **భైరవం**: జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక)
- **సింగిల్** : గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 20, టమాటా 20, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 22, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 36, బీరకాయలు 40, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 17, క్యారెట్ 44 దొండకాయలు 28, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 52, బరబాటి 34, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 70, బద్దచిక్కుడు 44, దోస కాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 110, కీరదోస 34, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 38 చిలగడ దుంపలు 32, కంద 64, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 40, కూర పెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	87
లైవ్ ధర	107
విత్ స్కిన్	184
స్కిన్‌లెస్	194

'సెయింట్ ఆన్స్' విద్యార్థినికి షైనింగ్ స్టార్ అవార్డు



తనూజాకు అవార్డు అందిస్తున్న బాల వీరాంజనేయులు

మల్కాపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం (సీఎస్ఈ ఒకేషనల్)లో చదివిన రూప తనూజా 976 మార్కులు సాధించడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపి కయ్యారు. ఈ మేరకు సోమవారం ఆంధ్ర విశ్వవిద్యాలయం అంబేడ్కర్ అసెంబ్లీ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయులు ఆమెకు అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా సదరు విద్యార్థినిని కళాశాల ప్రిన్సిపాల్ క్లాసిన్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి, కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా, తదితరులు అభినందించారు.

స్టీల్‌ప్లాంట్‌లో కార్మికులను తొలగించడం అన్యాయం

ఆందోళనలో అఖిల పక్ష కార్మిక సంఘాల నాయకులు ఆగ్రహం



హెచ్‌పీసీఎల్ గేటు వద్ద ఆందోళన చేస్తున్న అఖిలపక్ష కార్మిక సంఘాలు

మల్కాపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంట్‌లో అక్రమంగా తొలగించిన కార్మికులను తిరిగి విధులోకి తీసుకోవాని డిమాండ్ చేస్తూ పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న అఖిల పక్ష కార్మిక సంఘాల నాయకులు హెచ్‌పీసీఎల్ గేటు వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్, సీఐటీయూ మల్కాపురం జోన్ అధ్యక్షుడు కె.పెంటారావు, ప్రధాన కార్యదర్శ లక్ష్మణమూర్తి, ఇంటక్ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు కె.సత్యనారాయణ, వైఎస్ఆర్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అనిల్ మాట్లాడారు. ఎన్నికల ముందు స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుతామని చెప్పిన కూటమి నాయకులు, నేడు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా దాదాపు నాలుగువేల మంది కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. వెంటనే వీరిని విధుల్లో తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నరేష్, ఇంటక్ ప్రతినిధి తాతబాబుతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలి

... 5వ పేజీ తరువాయి

ఆయన విశిష్ట అతిథులు ఎంపీ శ్రీభరత్, కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్యే పి.గణబాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, డీఈవో ఎం.ప్రేమ్‌కుమార్‌తో కలిసి విద్యార్థులు ఏర్పాటు చేసిన డ్రీమ్, గ్రాటిట్యూడ్ వాల్స్‌ను సందర్శించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పేదింటి పిల్లల బంగారు భవిష్యత్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా షైనింగ్ స్టార్స్-2025 కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. వారం రోజుల్లో తల్లికి వందనం నిధులను జమ చేస్తామన్నారు.

గురుకులాల్లో ఐఐటీ, నీట్ శిక్షణ

ఇంటర్ విద్యార్థుల సౌకర్యార్థం ఈ ఏడాది నుంచి ఎస్సీ గురుకులాల్లో ఐఐటీ, నీట్ శిక్షణ తరగతులను నిర్వహిస్తామని మంత్రి శ్రీబాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు. ఇప్పటికే మూడు కేంద్రాల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, మరో ఏడు కేంద్రాల్లో త్వరలో తరగతులు జరిగేలా చర్యలు చేపడతామన్నారు. ఈ నెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు ప్రధాని మోదీ విశాఖ వస్తున్నారని, ఆయనతో పాటు నగరవాసులు, విద్యార్థులు యోగాలో భాగస్వాములు కావాలని కోరారు.



విద్యార్థులు ఏర్పాటు చేసిన డ్రీమ్, గ్రాటిట్యూడ్ వాల్‌ను పరిశీలిస్తున్న మంత్రి శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎంపీ శ్రీభరత్, తదితరులు



పదో తరగతి విద్యార్థిని సాయి తన్వికి మెరిట్ సర్టిఫికెట్ అందజేస్తున్న మంత్రి శ్రీబాలవీరాంజనేయస్వామి, కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ బట్టీ చదువులకు విద్యార్థులు స్వస్తి పలకాలని సూచించారు మార్కుల పై మమకారాన్ని వీడి కాన్సెప్ట్ ఓరియండెట్‌పై విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. మార్కులే జీవితం కాదని.. వాటి కోసం పిల్లలపై తల్లిదండ్రులు ఒత్తిడి చేయవద్దన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పి.గణబాబు మాట్లాడుతూ బృహత్తరమైన షైనింగ్ స్టార్ అవార్డుల కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు మౌలిక వసతులను కల్పించడంతో పాటు ఫలితాల సాధనపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నామన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా మండలానికి ఆరుగురి చొప్పున మొత్తం 121 మందిని ఎంపిక చేశామని, వీరిలో టెన్త్‌కు సంబంధించి 83 మంది, ఇంటర్మీడియట్ విద్యార్థులు 38 మంది ఉన్నారన్నారు. ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున మొత్తం రూ.24,20,000 అందజేశామన్నారు. డీఈవో ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాను ఉన్నత స్థానంలో నిలబెట్టేందుకు కృషి చేస్తామన్నారు. జేసీ కె.మయూర్ అశోక్, విద్యాశాఖ ఉన్నతాధికారులు శ్రీనివాసులరెడ్డి, మధుసూదనరావు, ఏపీసీ జె.చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఏయూ ప్రొఫెసర్లపై సస్పెన్షన్లు ఎత్తివేత

... 5వ పేజీ తరువాయి

ప్రక్రియను పూర్తిచేసి పదోన్నతులు కల్పించనున్నారు. మొత్తంగా 21 మందికి పదోన్నతులు ఇవ్వనున్నారు. అలాగే కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన కూడ నాగేశ్వరరావు సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని నిర్ణయం తీసుకున్నారు. కోర్టు తీర్పుకు అనుగుణంగా తదుపరి నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. సోషల్ వర్క్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ స్వామిదాస్‌పై సస్పెన్షన్ విధించి ఐదేళ్లు పూర్తయినందున ఆ సస్పెన్షన్‌ను కూడా ఎత్తివేయాలని నిర్ణయించినట్టు తెలిసింది. 2025-26 ఏడాదికి సంబంధించిన బడ్జెట్‌ను ఆమోదించారు. బీటెక్‌లో క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సును ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించేందుకు నిర్ణయం తీసుకున్నారు. వీటితోపాటు మరికొన్ని అంశాలపైనా చర్చించినట్టు చెబుతున్నారు.

పోలీస్ కమిషనరేట్‌కు 101 ఫిర్యాదులు

విశాఖపట్నం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : నగర పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదికకు 101 ఫిర్యాదులు అందాయి. సీపీ శంఖబ్రత బాగ్చి స్వయంగా బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. బాధితుల సమస్యలు విని సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అప్పన్న సన్నిధిలో ఆర్‌బీఐ డైరెక్టర్



స్వామివారి సన్నిధిలో ఆర్‌బీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాధాశ్యామ్‌రాథో

సింహాచలం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) :వరాహలక్ష్మీనృసింహస్వామిని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్యనిర్వాహక సంచాలకుడు రాధాశ్యామ్ రాథో సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న డైరెక్టర్ గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేసి, శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి ఫొటోను, ప్రసాదాలను అందజేశారు.

కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ వాణి బాధ్యతల స్వీకారం



విశాఖపట్నం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఐ. వాణి సోమవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా వ్యవహరిస్తున్న డాక్టర్ శివానంద నుంచి ఆమె బాధ్యతలను స్వీకరించారు. సీఎస్ఆర్ ఎంవో డాక్టర్ యు. శ్రీహరి, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ బీవీ రమణ, డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ డి. రాధాకృష్ణన్, డాక్టర్ వి. రవి, డాక్టర్ ఎల్. లోకనాథ్, డాక్టర్ జి. వాసవీ లత, అసిస్టెంట్ డైరెక్టర్ బీఎస్ సుమతితో పాటు పలు విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోగులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తానన్నారు. ఆస్పత్రిలో వైద్య సేవల ప్రమాణాలను మెరుగుపర్చడమే లక్ష్యంగా పని చేస్తానని, ఆస్పత్రికి వచ్చే ప్రతి రోగి సంతృప్తిగా వెళ్లేలా చేయడమే తన తక్షణ కర్తవ్యమన్నారు. రోగులకు ఏవైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావచ్చునని తెలిపారు.

వసూళ్లపై దృష్టిసారిస్తారా ?

కేజీహెచ్‌లోని అనేక విభాగాల వద్ద వసూళ్లపై పెద్ద ఎత్తున ఆరోపణలు వస్తున్నాయి. ఆయా విభాగాలను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది. గత పాలకులు కొన్ని మార్పులు చేసేందుకు ప్రయత్నించినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదు. కొత్త సూపరింటెండెంట్ డాక్టర్ వాణి ఆయా విభాగాలపై దృష్టిసారించాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు. ముఖ్యంగా గైనిక్ విభాగంలో సిబ్బంది పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈ విభాగాల్లో పని చేసే కింది స్థాయి సిబ్బందికి డ్యూటీలను అసోసియేషన్ నాయకులు వేస్తుంటారు. ఇందుకోసం వారికి ఖరీదైన వస్తువులను సదరు సిబ్బంది ఇస్తుంటారన్న ఆరోపణలు ఉన్నాయి. అటువంటి వారిని తొలగిస్తే అక్రమ వసూళ్లకు చెక్ పడుతుంది. అలాగే ఆస్పత్రిలో పని చేసే కొందరు వైద్యులు డ్యూటీ సమయాల్లో క్లినిక్స్, ప్రైవేటు ఆస్పత్రుల్లో సేవలందిస్తున్నారు. అటువంటి వారిపై ప్రత్యేక దృష్టిసారించి విధులకు హాజరయ్యేలా చూడాల్సి ఉంది. సెక్యూరిటీ, శానిటేషన్ విభాగాలకు చెందిన వారిపై కూడా అనేక ఆరోపణలు ఉన్నాయి. వీటితో పాటు ఆస్పత్రిలో పారిశుధ్యాన్ని మెరుగుపరచాల్సి ఉంది.

యోగాతో జీవన శైలిలో మార్పు



ఎంజీఎం పార్కులో యోగా చేస్తున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్, జాయింట్ కమిషనర్ కె.రమేశ్, కార్యదర్శి బి. మురళీకృష్ణ, చీఫ్ అర్బన్ ప్లానర్ శిల్ప, తదితరులు

» **వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్**

బీచ్ రోడ్డు, జూన్ 9, (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరూ యోగాను జీవన శైలిలో భాగం చేసుకోవాలని వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ అన్నారు. సోమవారం వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో వుడా పార్కు వద్ద ఉన్న ఎంజీఎం పార్కులో ఏర్పాటు చేసిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతిరోజూ యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చునని తెలిపారు. ఈనెల 21న జరిగే అంతర్జాతీయ యోగ దినోత్సవంలో నగర ప్రజలంతా పాల్గొని, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆ రోజు ఆర్కే బీచ్ నుంచి కాళీమాత ఆలయం, భీమునిపట్నం వరకు భారీ ఎత్తున యోగా కార్యక్రమం ఉంటుందని తెలిపారు. యోగా వల్ల మనిషిలో మానసిక, శారీరక రుగ్మతలు సులువుగా తగ్గుతాయని చెప్పారు. ఉద్యోగంలో నిత్యం ఒత్తిడితో ఉండేవారు యోగా చేయడం వల్ల ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చునన్నారు. జాయింట్ కమిషనర్ కె. రమేశ్ మాట్లాడుతూ యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో ఉండవచ్చని తెలిపారు. అనంతరం యోగాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ కార్యదర్శి పి. మురళీకృష్ణ, చీఫ్ అర్బన్ ప్లానర్ వి. శిల్ప, యోగా శిక్షణ ఉపాధ్యాయులు, వీఎంఆర్‌డీఏ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్ర వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేయాలి

... 5వ పేజీ తరువాయి

రవాణా, తాగునీరు, తదితర ఏర్పాట్లను సమర్థంగా చేపట్టాలని పేర్కొన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్. వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, రాష్ట్ర స్థాయి అధికారులు సూర్యతేజ, దినేశ్‌కుమార్, అభిషిత్, తదితరులు పాల్గొన్నారు.

8 జిల్లాల నుంచి 156 మంది అధికారులు

నగరంలో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు వస్తున్న సంగతి తెలిసిందే. మొత్తం ఐదు లక్షల మందితో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించి రికార్డు నెలకొల్పాలని ప్రణాళిక సిద్ధం చేయడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం పక్కా ఏర్పాట్లు చేస్తోంది. ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు బీచ్ రోడ్డులో ఎక్కడికక్కడ కంపార్ట్‌మెంట్లు ఏర్పాటు చేసి, వాటిని పర్యవేక్షించే బాధ్యతను అధికారులకు అప్పగించారు. ఇందుకోసం శ్రీకాకుళం జిల్లా నుంచి కాకినాడ వరకు ఎనిమిది జిల్లాలకు చెందిన 156 మంది అధికారులను ఈ నెల 15 నుంచి కార్యక్రమం పూర్తయ్యేంత వరకు ఇక్కడే పనిచేయాలని సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో తొమ్మిది మంది ఐఏఎస్ అధికారులు (జాయింట్ కలెక్టర్ క్యాడర్), 31 మంది డిప్యూటీ కలెక్టర్లు, ఏడుగురు జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు, మరో 109 మంది తహశీల్దార్ కేడర్ అధికారులు ఉన్నారు.

నేడు మంత్రుల కమిటీ సమావేశం

అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సంబంధించి మంగళవారం మంత్రుల కమిటీ కలెక్టరేట్‌లో సమావేశం కానున్నది. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, హోంమంత్రి వంగలపూడి అనిత, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోల శ్రీబాల వీరాంజనేయస్వామితో పాటు ఎంపీ, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొంటారు.

సింహాచల దేవస్థానం ఈవో త్రినాథ్‌కు ఆర్‌జేసీగా బదిలీ

... 5వ పేజీ తరువాయి

ఘటనలో ఏడుగురు భక్తులు మృతి చెందిన సంగతి తెలిసిందే. అప్పుడు ఆలయ ఈఓ త్రినాథరావు సెలవుపై అమెరికా వెళ్లడంతో రాజమహేంద్రవరం ఆర్‌జేసీ కె.సుబ్బారావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ ప్రమాదంపై ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ కె.సుబ్బారావుపై చర్యలు తీసుకోవాలని సూచించడంతో ప్రభుత్వం ఆయనను సస్పెండ్ చేసింది. దీంతో ఆ పోస్టు ఖాళీ అయింది. ద్వారకా తిరుమల దేవస్థానం ఈవో ఎన్‌వీఎస్ఎన్ మూర్తికి అదనపు బాధ్యతలు ఇచ్చారు. తాజాగా ప్రభుత్వం త్రినాథ రావును రాజమహేంద్రవరం ఆర్‌జేసీగా బదిలీ చేయడంతో మూర్తిని అక్కడ ఆర్‌జేసీ పోస్టు నుంచి రిలీవ్ చేశారు.

కాగా ఏటా చందనోత్సవం వివాదాస్పదంగా మారుతోంది. 2023లో జరిగిన ఉత్సవంపై చాలా ఆరోపణలు వచ్చాయి. అప్పుడు ఈవోగా త్రినాథరావే ఉన్నారు. ఆయనతో పాటు ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆ ఏడాది ఉత్సవంలో తొక్కిసలాట, తోపులాటలు జరిగాయి. కలెక్టర్ అంతరాలయ దర్శనాలు నిలిపివేసినా, అప్పుడు కూడా వీవీఐపీ టికెట్లను ఈవో కార్యాలయంలో విక్రయించారని, లెక్కకు మించి టికెట్లు ఇవ్వడం వల్లే పెద్దసంఖ్యలో వీవీఐపీలు అంతరాలయంలోకి వెళ్లారని అప్పటి జేసీ విశ్వనాథన్ నివేదిక ఇచ్చారు. ఈవోతో పాటు పలువురు అధికారులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. తాజాగా ఈ ఏడాది కూడా చందనోత్సవం వివాదాస్పదం కావడంతో.. నాడు చర్యలు చేపట్టకపోవడం వల్లే అదే ఈవో త్రినాథరావు ఇంకా కొనసాగుతున్నారని ఆరోపణలు రావడంతో ప్రభుత్వం ఇప్పుడు ఆయనను ఈవో పోస్టు నుంచి బదిలీ చేసింది. అయితే ఇంకా ఎవరినీ నియమించకపోవడంతో ఆయనకే అదనపు బాధ్యతలు నిర్వహించాలని సూచించింది.

నగరం గరం..

... 5వ పేజీ తరువాయి

నిప్పులకుంపటిలా మారింది. వివిధ పనుల నిమిత్తం బయటకు వచ్చిన వారంతా ఠారెత్తిపోయారు. భవన నిర్మాణ కార్మికులు, ఇతరత్రా పనులు చేసేవారంతా ఎండకు తాళలేకపోయారు. ఎక్కువమంది ప్రజలు ఏసీ రెస్టారెంట్లను ఆశ్రయించారు. ద్విచక్రవాహనదారులైతే ఎండకు సొమ్మసిల్లిపోయారు. సాయంత్రం తరువాత నుంచి కొద్దిసేపు గాలులు వీచినా వేడి వాతావరణం కొనసాగడంతో ప్రజలు నానాపాట్లు పడ్డారు. ఇళ్లల్లో ఉన్నవారందరూ ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు వేసుకోవాల్సి వచ్చింది. బీచ్ రోడ్డులో కూడా వేడిగాలులు, ఉక్కపోత కొనసాగడంతో తీరంలో సేదదీరేవారు సైతం ఇబ్బందులు పడ్డారు. ఎయిర్‌పోర్టులో సోమవారం 39.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈ నెల రెండో తేదీన ఎయిర్‌పోర్టులో 39.4 డిగ్రీలు నమోదైంది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఈ నెల రెండో తేదీ, సోమవారమే అత్యధికంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా గత వారం రోజులగా 36 నుంచి 38 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు కావడం, పగటి పూట ఎండ తీవ్రత చాలా అధికంగా ఉండడం, వర్షాలు లేకపోవడంతో నగరవాసులు అల్లాడిపోతున్నారు. మంగళవారం కూడా ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణశాఖ తెలిపింది.

క్రైం... crime news

మేడ పైనుంచి పడి బాలిక మృతి



గ్రీష్మ (ఫైల్)

మల్కాపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఆటాడుకుంటూ ఓ బాలిక రెండో అంతస్తు పైనుంచి కింద పడిపోవడంతో తీవ్ర గాయాలకు గురై మృతిచెందింది. మల్కాపురం గాంధీజీ వీధిలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలివి. ఈనెల రెండో తేదీన గ్రీష్మ అనే ఐదేళ్ల బాలిక రెండో అంతస్తులోని తన ఇంటి గుమ్మం మీద ఆడుకుంటూ.. ఒక్కసారిగా కింద పడిపోయింది. తలకు తీవ్ర గాయం కావడంతో ఆమెను తల్లిదండ్రులు కేజీహెచ్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అప్పగించారు. మల్కాపురం ఎస్ఐ శ్రీనివాసరావు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో కాలువలో పడి వ్యక్తి మృతి



కాలువలో పడి ఉన్న రాంబాబు మృతదేహం

గోపాలపట్నం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో కాలువలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. చంద్రనగర్‌లో ఇంటి రాంబాబు (42) డ్రైవర్. తన తల్లితో కలిసి నివాసం ఉంటున్నాడు. ఇతడు మద్యానికి బానిస కావడంతో భార్య, పిల్లలు పదేళ్ల క్రితమే అన్నవరం వెళ్లిపోయారు. ఆదివారం రాత్రి పూటుగా మద్యం సేవించిన తన ఇంటి సమీపంలోని కాలువ గట్టుపై నిద్రించాడు. ఈక్రమంలో కాలువలో పడి మృతి చెందాడు. సోమవారం స్థానికులు గుర్తించి అతని బంధువులకు సమాచారం అందించారు. వారి ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ రామారావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది పట్టుకుని వారి నుంచి రూ.68,950 విలువైన 13.79 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు నిర్వహిస్తుండగా తెలంగాణకు చెందిన పెలియరామ్ సింగ్, బస్సి మురారి అనే ఇద్దరు ఒడిశా నుంచి సికింద్రాబాద్‌కు గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డారని, వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.

అదృశ్యమైన వృద్ధురాలు భర్తకు అప్పగింత

పెందుర్తి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : గుడికి వెళతానని ఇంట్లో చెప్పి బయలుదేరిన భార్య అదృశ్యమైన గంటల వ్యవధిలోనే పోలీసులు ఆమె ఆచూకీ కనుకొని భర్తకు అప్పగించారు. సీఐ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం.. సెయిల్‌లో పనిచేసి పదవీ విరమణ పొందిన శరగడం శ్రీనివాసరావు, వరలక్ష్మి దంపతులు చినముషిడివాడ శ్రమశక్తినగర్‌లో నివాసం ఉంటున్నారు. శ్రీనివాసరావు భార్య వరలక్ష్మి (60)కి మతిమరుపు. ఆదివారం సాయంత్రం ఆమె గుడికి వెళతానని భర్తకు చెప్పి ఇంట్లోంచి బయలుదేరింది. చీకటి పడినా రాకపోవడంతో ఆందోళన చెందిన భర్త తన స్నేహితులు, బంధువుల ఇళ్లలో వెతికారు. ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించడంతో సీఐ సతీశ్‌కుమార్ స్పందించి సిబ్బందిని అప్రమత్తం చేశారు. రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. భర్త చెప్పిన ఆధారాలతో ఆమె సంచరించిన ప్రదేశాల్లో సీసీ ఫుటేజీలను పరిశీలించారు. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో పెందుర్తిలో గల ఓ షాపింగ్ పార్క్‌లోని సెల్లార్‌లో ఉన్న ఆమెను పోలీసులు గుర్తించి, భర్తకు అప్పగించారు. వరలక్ష్మి వృద్ధురాలు కావడంతో పాటు కొంతకాలంగా అల్జీమర్స్‌తో బాధపడుతుందని సీఐ వివరించారు.

సమ్మెకు ఎన్‌ఎంయూఏ సమాయత్తం

ద్వారకాబస్‌స్టేషన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్‌గా 2019లో సురేంద్రబాబు జారీ చేసిన 1/2019 సర్క్యులర్‌ను ఆర్టీసీ యాజమాన్యం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ విజయనగరం జోన్ పరిధిలోని ఆరు జిల్లాల్లో ఒకరోజు సమ్మెకు దిగేందుకు సమాయత్తమవుతున్నది. జోన్ పరిధిలో ఈ సర్క్యులర్‌ను జిల్లా యాజమాన్యాలు అమలు చేయడం లేదని ఆరోపిస్తూ అసోసియేషన్ సమ్మెకు పిలుపునిచ్చింది. జోన్ పరిధిలోని ఆరు జిల్లాల కలెక్టర్లకు బుధవారం సమ్మె నోటీసు ఇవ్వాలని రీజనల్ కమిటీ తీర్మానించింది. ఆర్టీసీలో సిబ్బంది ఏమైనా తప్పులు చేస్తే ఎలాంటి పనిష్మెంట్లు ఇవ్వాలో 2019లో సురేంద్రబాబు సర్క్యులరును విడుదల చేశారు. అయితే దీనిని జోన్ పరిధిలోని శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి, విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో అధికారులు అమలు చేయడం లేదని ఆరోపిస్తూ ఎన్ఎంయూఏ ఒక రోజు సమ్మెకు సమాయత్తమవుతున్నది.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

విశాఖపట్నం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పలు రైళ్లకు తాత్కాలికంగా అదనపు కోచ్‌లు జత చేశామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ నెల 30 వరకు విశాఖ-బ్రహ్మపూర్-విశాఖ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (18526, 18525), విశాఖ-భువనేశ్వర్-విశాఖ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లకు (22820, 22819), విశాఖ-కొరాపుట్-విశాఖ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లకు (18512, 18511) ఈ నెల 30 వరకు అదనంగా రెండు జనరల్ సెకెండ్ సీటింగ్ కోచ్‌లు జత చేశారు. అలాగే విశాఖ-రాయపూర్-విశాఖ పాసింజర్ రైళ్లకు (58528, 58527), విశాఖ-కొరాపుట్-విశాఖ పాసింజర్ రైళ్లకు (58538, 58537), విశాఖ-బ్రహ్మపూర్-విశాఖ పాసింజర్ రైళ్లకు (58532, 58531), విశాఖ-భవానీపట్న-విశాఖ పాసింజర్లకు (58504, 58503), విశాఖ-గుణుపూర్-విశాఖ పాసింజర్ (58506, 58505) రైళ్లకు ఈ నెల 30 వరకు అదనంగా ఒక జనరల్ సీటింగ్ కోచ్‌ను అందుబాటులో ఉంచారు. విశాఖ-పరదీప్ ఎక్స్‌ప్రెస్‌కు (22810) ఈ నెల 15, తిరుగు ప్రయాణంలోని పరదీప్-విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు (22809) ఈ నెల 16న రెండు స్లీపర్ క్లాసు కోచ్‌లు, అలాగే విశాఖ-అమృతసర్ ఎక్స్‌ప్రెస్‌కు (20807) ఈ నెల 10న, తిరుగు ప్రయాణంలోని అమృతసర్-విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు (22808) ఈ నెల 14న ఒక స్లీపర్ క్లాసు జత చేశామని పేర్కొన్నారు.

యశ్వంత్‌పూర్, సంత్రాగచ్చి రైళ్లు పాక్షిక రద్దు

నైరుతి రైల్వే పరిధిలో పవర్ బ్లాక్‌తో పనులు చేపడుతున్న నేపథ్యంలో హౌరా-యశ్వంత్‌పూర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22831) ఈ నెల 11, 18, 25న హౌరా నుంచి యలహంక వరకు, తిరుగు ప్రయాణంలోని యశ్వంత్‌పూర్-హౌరా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22832) ఈ నెల 13, 20, 27న యలహంక నుంచి హౌరా మధ్య మాత్రమే నడుస్తుందని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. అలాగే సంత్రాగచ్చి-యశ్వంతపూర్ ప్రత్యేక రైలు (02863) ఈ నెల 12, 19, 26న సంత్రాగచ్చి నుంచి యలహంక వరకు, తిరుగు ప్రయాణంలోని యశ్వంత్‌పూర్-సంత్రాగచ్చి ప్రత్యేక రైలు (02864) ఈ నెల 14, 21, 28న యలహంక నుంచి సంత్రాగచ్చికి నడుస్తుందని పేర్కొన్నారు. ఈ రైళ్లను యలహంక, యశ్వంత్‌పూర్ మధ్య రాకపోకలను కొన్ని నిర్దేత తేదీలలో తాత్కాలికంగా రద్దు చేశామన్నారు.

వసతి గృహాల్లో ప్రవేశాలకు దివ్యాంగుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

విశాఖపట్నం,జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శారీరక, బధిర పురుష దివ్యాంగులకు పెందుర్తి, పెదవాల్తేరుల్లో నిర్వహిస్తున్న హాస్టళ్లలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆ శాఖ ఉపసంచాలకులు జె.మాధవి ఒక ప్రకటనలో తెలిపారు.2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి నాలుగో తరగతి నుంచి డిగ్రీ వరకు చదివే దివ్యాంగ విద్యార్థులకు ఉచిత ప్రవేశాలు కల్పిస్తున్నామన్నారు. హాస్టళ్లలో చేరిన వారికి ఉచిత భోజనం, వసతితో పాటు కాస్మోటిక్స్, యూనిఫామ్, నోటు పుస్తకాలతో పాటు ప్రభుత్వం అందించే ఇతర సదుపాయాలు అందిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన పురుష విద్యార్థులు సదరం సర్టిఫికెట్, స్కూల్ ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్, ఆధార్, రేషన్ కార్డు/ఆదాయ ధ్రువపత్రం, బ్యాంక్ అకౌంట్ బుక్, కుల ధ్రువీకరణ పత్రం, బ్లడ్ గ్రూప్, తల్లిదండ్రుల ఆధార్ కార్డుల జిరాక్స్ కాపీలతో పాటు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో వసతిగృహాల్లోని వార్డెన్లను సంప్రదించాలన్నారు.